

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శనివారం 4 జనవరి 2025



సోమశిలకు 3,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 3,238 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.813 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



రేపే ముగ్గుల పోటీలు

నెల్లూరు, కావలి, గూడూరులో..

ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు రేపు జరగనున్నాయి. తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు నెల్లూరు, కావలి, గూడూరు కేంద్రాల్లో ఆదివారం నాడు జరుగుతాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో జరుగుతాయి. నెల్లూరు నగరంలో వీఆర్ కళాశాల మైదానం, కావలిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కారోనేషన్ రీడింగ్ రూం ఆవరణం, గూడూరు సనత్‌నగర్‌లోని శ్రీచైతన్య కళాశాల ఆవరణంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గురిలో ఒకరిని జిల్లా విజేతగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదీన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. నెల్లూరు, కావలి, గూడూరులలో జరిగే పోటీలకు సీఎంఆర్ చంద్రన బ్రదర్స్ లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

విద్యుత్ శాఖ వార్షిక ఆదాయ నివేదికపై 7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు (జడ్పీ), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖ 2025-26 ఏడాది ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై 7, 8 తేదీలలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి 2 నుంచి 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని పేర్కొన్నారు. కర్నూలు నుంచి ఉన్నతాధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే అభిప్రాయ సేకరణకు జిల్లాలోని అన్ని డివిజన్ల వినియోగదారులు వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని హాజరు కావాలని ఆయన కోరారు.

ఏడాదైంది.. హామీ ఏమైంది!?

- ఆంధ్ర తీరంలోకి తమిళ బోట్ల చొరబాటును నియంత్రించడంలో వైఫల్యం
- గతేడాది కేంద్ర మంత్రి దృష్టికి సమస్య
- పరిష్కారంలో చొరవ చూపని పాలకులు
- హద్దులు దాటుతున్న తమిళ మత్స్యకారులు
- మత్స్య సంపదను కొల్లగొడుతున్న వైనం

తమిళనాడుకు చెందిన హైస్పీడ్ బోట్లు అంటేనే మన మత్స్యకారులు హడలిపోతున్నారు. ఆ రాష్ట్రానికి చెందిన ఐదారు స్పీడ్ బోట్లు ఒకేసారి మన తీరంలోకి చొచ్చుకువచ్చి మత్స్యసంపదను కొల్లగొట్టడం, అడ్డువచ్చిన వారిపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఈ సమస్య తెలుగు, తమిళ మత్స్యకారుల మధ్య కొన్నేళ్లుగా నడుస్తోంది.



బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌లో గతేడాది జనవరి 1న మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలా (ఫైల్)

అయితే..

2024, జనవరి 1వ తేదీన అప్పటి కేంద్ర మత్స్య, పాడిపరిశ్రమ, పశుసంవర్థక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా సముద్రతీరంలో ఫిషింగ్ హార్బర్ల స్థితిగతులు, మత్స్యకారుల జీవనవిధానం, మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపట్టిన సాగర్ పరిక్రమ పర్యటనలో భాగంగా సముద్ర మార్గాన బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌గా వచ్చారు. ఆయన వెంట మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నీతూ కుమారి, కేంద్ర మత్స్య శాఖ అధికారులూ ఉన్నారు. మత్స్యకారులతో వారు మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమిళనాడులోని కడలూరు నుంచి మత్స్యకారులు హైస్పీడ్ మోటార్ల బోట్లలో వచ్చి ఇక్కడి మత్స్యంపదను దోచుకెళ్లుతున్నారని, ఎదురిస్తే దాడులు చేస్తున్నారంటూ స్థానిక మత్స్యకారులు ఏకరువు పెట్టారు. దీంతో కేంద్రమంత్రి ఇరు రాష్ట్రాల అధికారులతో చర్చించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో తమ సమస్య పరిష్కారం అవుతుందని అప్పట్లో మత్స్యకారులు సంబరపడ్డారు. అయితే, ఏడాది దాటినా హామీ నెరవేరలేదు. దీనిపై కనీసం చర్చ కూడా జరగలేదు. కేంద్ర మంత్రి రాకకు 2 నెలల ముందు తమిళ బోట్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బోటును అద్దెకు తీసుకుంది. అయితే, తమిళ బోట్ల హైస్పీడ్‌కు ఈ బోటు సామర్థ్యం చాలకపోవటంతో తిరిగి ఇచ్చేశారు. వాస్తవంగా తమిళ జాలర్లు 500 హెచ్‌పీ హైస్పీడ్ మోటార్లతో ఉన్న బోట్లతో వస్తుండటంతో అంతటి సామర్థ్యం ఉన్న బోట్లు మన జాలర్ల వద్ద లేకపోవటంతో తమిళ బోట్ల అక్రమ చొరబాటును ఎదుర్కోలేక పోతున్నారు. తమిళనాడులో మత్స్య కారుల ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి అడ్డు చెప్పలేక పోతోంది. దీంతో తమిళ హైస్పీడ్ బోట్లు వచ్చి తరచూ ఆంధ్రతీరంలో చొరబడి మత్స్య సంపదను దోచుకునిపోవటమేగాక ఇక్కడ వలలు, బోట్లను ధ్వంసం చేస్తూ దాడులు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ చేయలేక పోతున్నాయి. ఆంధ్ర జాలర్లే హైస్పీడ్ బోటును కొనుగోలు చేద్దామనుకుంటే అంత ఖరీదు భరించ లేకపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం సబ్సిడీ ఇస్తే మిగతా తామే భరించి హైస్పీడ్ బోట్లు కొనుగోలు చేసుకుంటామని మత్స్యకారులు చెబుతున్నారు.

ఇలా చేస్తే..

కేంద్రప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి రెండు రాష్ట్రాల మత్స్యకార సంఘాల నాయకులతో సమావేశమై సముద్రతీరంలో చేపలవేటకు ఉన్న పరిమితులు, నిబంధనలు వివరించాలి. మత్స్య శాఖ, ప్రభుత్వ నిబంధనల మేరకు తీర ప్రాంతానికి 10 కి.మీ దూరంలో పెద్ద బోట్లు కలిగిన వారు చేపలవేట సాగించుకోవచ్చనే నిబంధన అమలు జరిగేలా చూడాలి. దీనిని ఎవరు అతిక్రమించినా కేంద్రమే చర్యలు తీసుకోవాలి.

- తమిళనాడు ప్రభుత్వం కూడా నిబంధనల మేరకే వేట కొనసాగించాలని ఆ రాష్ట్ర మత్స్యకారులకు తెలపాలి. వాటిని అతిక్రమిస్తే ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు వివరించి కఠినంగా వ్యవహరించాలి.
- ఏపీ ప్రభుత్వం కూడా తీర ప్రాంతానికి 10 కి.మీలోపు ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు చేపట్టాలి. వాటిని కట్టడి చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని నియమించుకోవాలి. అలాగే హైస్పీడ్ ఇంజన్లు ఉన్న బోట్లను కొనుగోలు చేసి వాటి ద్వారా ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు చేపట్టాలి. లేదా స్థానిక మత్స్యకారులకే ఎక్కువ సబ్సిడీపై హైస్పీడ్ బోట్లు ఇచ్చి మత్స్యకారులు, మెరైన్ పోలీస్‌లు సంయుక్తంగా వాటిని ఎదుర్కొనేందుకు తగిన శిక్షణ ఇవ్వాలి.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

కేంద్రం చొరవ తీసుకోవాలి



తమిళ బోట్లు ఆంధ్రతీరానికి వచ్చి మత్స్యసంపదను దోచుకుపోవటం, ఇక్కడ వలలు, బోట్లు ధ్వంసం చేయడం, అడ్డుకునేవారిపై దాడులు చేయటం వంటి సమస్యపై కేంద్రం చొరవ తీసుకుని పరిష్కరించాలి. అలాగే స్థానిక మత్స్యకారులు హైస్పీడ్ బోట్లు కొనుగోలు చేసుకనేందుకు కేంద్రం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం సబ్సిడీ ఇస్తే మిగతాది స్థానిక మత్స్యకారులు భరించి కొనుగోలు చేసుకుంటారు.

- కొండూరు పోలిశెట్టి, ఆఫ్కాబ్ రాష్ట్ర మాజీ చైర్మన్

ఎదుర్కోవాలంటే భయపడుతున్నాం



ఆంధ్ర తీరానికి తమిళబోట్లు చొరబడి మత్స్యసంపదను దోచుకు పోతున్నా వారిని ఎదుర్కొనే ధైర్యం లేక భయపడుతున్నాం. వారి బోట్ల స్పీడ్‌కు మా బోట్లపై వెళితే వాటిని ఢీకొట్టి నష్టపరుస్తున్నారు. దీంతో తమిళ బోట్లు వస్తున్నాయని తెలిసి కూడా ఎదుర్కోలేక పోతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతీసుకుని సమస్యను పరిష్కరించాలి.

- అలారి సోమయ్య, మత్స్యకారుడు, పాతపాలెం, బోగోలు మండలం

ఎన్నో ఏళ్ల జిల్లా వాసుల కల నెరవేరబోతోంది. దగదర్తి వద్దే విమానాశ్రయం ఏర్పాటుకు ఇప్పటికే అడుగులు వేసిన కూటమి ప్రభుత్వం తాజాగా పనులపై కీలక ఆదేశాలు వెలువడ్డాయి. కేంద్ర పౌర విమానాయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్టు అధికారులతో సీఎం చంద్రబాబు శుక్రవారం సమావేశమై, పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.


కల నెరవేర్చే దిశగా..

ఆశలు రేపుతున్న దగదర్తి విమానాశ్రయ నిర్మాణం
కేంద్ర మంత్రి, ఎయిర్‌పోర్టు అధికారులతో సీఎం సమీక్ష
పనులు వేగవంతం చేయాలని చంద్రబాబు ఆదేశం

నెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : దగదర్తి విమానాశ్రయం పనులను పట్టాలెక్కించడానికి కృత నిశ్చయంతో ఉన్న సీఎం చంద్రబాబు శుక్రవారం ఆ అంశంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించబోయే ఏడు విమానాశ్రాయాలలో దగదర్తి విమానాశ్రయం ఒకటి. 2014-19లో అప్పటి తెలుగుదశం ప్రభుత్వం ఈ విమానాశ్రయం నిర్మించడానికి అన్ని అనుమతులు సాధించింది. 1379 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించాలని అప్పట్లో నిర్ణయించ గా అందులో 635 ఎకరాల భూసేకరణ తెలుగుదేశం ప్రభుత్వంలో నే పూర్తి చేసింది. మరో 745 ఎకరాలు సేకరించాల్సి ఉంది. అయితే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం విమానాశ్ర య నిర్మాణాన్ని అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే దగదర్తిలో విమానాశ్రయం నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల ప్రచార సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం దగదర్తి విమానాశ్రయ పనులు ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ ప్రాజెక్టుపై కీలక చర్చ సాగింది. నెల్లూరు జిల్లాకు బీపీసీఎల్ రిఫైనరీ వస్తోంది. వీటికితోడు ఈ జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని, రెండు ఓడరేవులు కలిగిన నెల్లూరు జిల్లాలో కార్గో విమానాలకు కూడా అనువైన విమానాశ్రయం అవుతుందని సీఎం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విమానాశ్రయాల్లో ప్రైవేటు విమానాల పార్కింగ్ అవసరాలు పెరుగుతాయని, దగదర్తి విమానాశ్రయ నిర్మాణంలో ఆ విషయాన్ని కూడా గుర్తుపెట్టుకొని రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే శ్రీసిటీ సెజ్‌లో ఎయిర్ స్ట్రిప్ తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు.



దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు ఆవిష్కరించిన శిలాఫలకం



యూటర్న్ ప్రమాద నివారణ (యూటర్న్ యాక్సిడెంట్ ప్రివెన్షన్)



విద్యార్థుల పేర్లు : సీహెచ్.దీక్ష, ఎస్‌కె.కరిష్మా, **తరగతి :** 9వతరగతి, **గైడ్ టీచర్ :** అమరావతి **పాఠశాల :** ప్రభుత్వ ట్రైబుల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల, గొలగమూడి, వెంకటాచలం మండలం. **ఉపయోగం:** పర్వతరోడ్లు, వంపులు, కొండలు, యూ ఆకార మలు పులు ఉన్న రోడ్లలో ప్రమాదాలను నివారించవచ్చు. ఆయా రోడ్లపై డ్రైవింగ్ చేసేవారికి ఇతర వైపుల నుంచి వచ్చే వాహనాలు కనిపించవు. ప్రతి ఏడాది వేలాదిమంది ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి. ఏ వ్యక్తి ఆపరేట్ చేయనవసరం లేకుండా ఆటోమేటిక్‌గా దీన్ని వినియోగించవచ్చు. క్లిష్టమైన ప్రదేశాల్లో సెన్సార్‌లు దెబ్బ తినకుండా రక్షించడానికి అన్ని ఏర్పాట్లు ప్రాజెక్ట్‌లో ఉన్నాయి. అలాగే వాహనం సంఖ్య, వేగాన్ని గుర్తించే వ్యవస్థతోపాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ప్రమాదాలు జరగకుండా బజర్ విధానంతో అప్రమత్తం చేస్తుంది.

ఆవిష్కరణ అదిరే..!

బాల మేధావుల సృజన
వినూత్న ప్రాజెక్టుల రూపకల్పన
వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న నమూనాలు
రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఆరు ప్రాజెక్టుల ఎంపిక



మదిలో మొలిచిన ఆలోచనలకు సృజనను జోడించి సమాజానికి ఉపయోగపడే చక్కటి ఆవిష్కరణలకు బాల శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. నిత్యం తాము చూస్తున్న సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా అడుగులు వేశారు. ఇందుకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం తోడైంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆర్ఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సదరన్ ఇండియన్ పేరుతో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. అందులో వివిధ పాఠశాలల విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. పెద్దలను సైతం ఆలోచింపజేసేలా ఉన్న ఆ ఎగ్జిబిట్స్‌తో అధికారులు, తల్లిదండ్రుల ప్రశంసలు అందుకున్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన 114 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనకు ఉంచారు. వీరిలో ప్రతిభ చూపిన 6 ప్రాజెక్ట్‌లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

6



కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం!

- నేటి నుంచి అమలుకు ఏర్పాట్లు
- డొక్కా సీతమ్మ పేరుతో పథకం పునరుద్ధరణ

6

ఖాకీ పరీక్షలకు సగం మందే!

కానిస్టేబుల్ ఎంపికలకు అభ్యర్థులు దూరం

నెల్లూరు(క్రైం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలపై అభ్యర్థులు ఆసక్తి చూపడం లేదు. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో గత నెల 30 నుంచి అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు సుమారు 600 మంది పరీక్షలకు హాజరయ్యేలా అధికారులు హాల్‌టికెట్లు జారీ చేశారు. అయితే ప్రతి రోజూ సగం మంది ఈ ఫిజికల్ టెస్ట్‌కు గైర్హాజరవుతున్నారు. నాలుగు రోజులుగా జరుగుతున్న పరీక్షలకు 2227 మంది అభ్యర్థులకుగాను 1127 మంది మాత్రమే హాజర య్యారు. 1090 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

అభ్యర్థుల హాజరు ఇలా...

తేదీ	అభ్యర్థుల సంఖ్య	హాజరైన వారు	గైర్హాజరు
డిసెంబరు 30	600	298	302
డిసెంబరు 31	600	275	325
జనవరి 2	600	328	272
జనవరి 3	417	226	191
మొత్తం	2217	1127	1090

● రెండేళ్ల తర్వాత...

గత వైసీపీ ప్రభుత్వం 2022వ సంవత్సరంలో కానిస్టేబుల్ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 జనవరి 22న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. కొద్ది రోజులకే ఫలితాలు విడుదల చేసినా అప్పటి నుంచి ఫిజికల్ టెస్ట్ నిర్వహించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాటి ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తోంది. ప్రిలిమినరీ పరీక్షలకు 20,352 మంది జిల్లా నుంచి హాజరుకాగా వారిలో 3855 మంది పురుషులు, 835 మంది మహిళలు ఫిజికల్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. అయితే వారిలో సగం మంది కూడా దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొనకపోతుండటం గమనార్హం.

● వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే...

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో చేసిన జాప్యం కారణంగానే కానిస్టేబుల్ అభ్యర్థులు ఫిజికల్ టెస్ట్‌లకు హాజరుకావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రిలిమినరీ పరీక్షల్లో విజయం సాధించిన అభ్యర్థులు ఆ వెంటనే దేహదారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రత్యేక ట్రైనర్ల వద్ద శిక్షణ పొందారు. అలాగే మెయిన్ పరీక్షలపైనా దృష్టి సారించారు. కానీ, ఏళ్ల

(మిగతా 6లో)



వేణుగోపాలుడికి శ్రీరామ పట్టాభిషేకం

నెల్లూరులోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి స్వామి వారికి శ్రీరామ పట్టాభిషేకం అలంకారం జరిగింది. అలాగే, తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో శ్రీవారికి రాజమన్నార్ అలంకారం జరిగింది. రెండు చోట్ల అళ్వార్ల ఘోష్టి, దివ్యనాలాయిర ప్రబంధ ఘోష్టి గానం, శాత్తుమురై జరిగాయి. ఉదయం గోదాదేవికి ధనుర్మాస పూజలు జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



ఘనంగా గోదాదేవికి పూజలు

పెంచలకోన క్షేత్రంలో ధనుర్మాస శుక్రవారం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణలతో ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)



ఆవిష్కరణ అదిరే..!

- బాల మేధావుల సృజన
- వినూత్న ప్రాజెక్టుల రూపకల్పన
- వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న నమూనాలు

నెల్లూరు (విద్య), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సదరన్ ఇండియన్ పేరుతో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మానవాళికి ఉపయోగ పడేలా సైన్స్ పరిశోధనలు విస్తృతంగా జరగాలని, దీనికి పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పునాదులు వేసి వారిని ఉత్తమ వైజ్ఞానికులుగా తీర్చిదిద్దాలని ఆమె పిలుపునిచ్చారు. ఆధునిక, సాంకేతిక రంగాల్లో దేశం అద్భుత ఫలితాలు సాధిస్తోందని, కలుషితమైన వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఖగోళ దర్పణాన్ని, విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలను అధికారులు సందర్శించి విద్యార్థులను అభినందించారు.

● సాయంత్రం జరిగిన ముగింపు వేడుకల్లో డీఈవో బాలాజీరావు పాల్గొని ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని, వీటిని అందిపుచ్చుకునేలా విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వం అందించే మౌలిక సదుపాయాలను సరైన రీతిలో సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమంగా ఎదగాలన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమాల్లో సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ జానకిరామయ్య, ఎంఈఓ మురళీధర్, జడ్జీలుగా వ్యవహరించిన వీఎస్‌యూ ప్రొఫెసర్స్ డా ఎస్‌బీ.సాయినాథ్, డాక్టర్ పి.గోపీకృష్ణ, డాక్టర్ ఎ.శివశంకర్‌రెడ్డి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ యూ.హుస్సేనయ్య, డీకేడబ్ల్యూ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జె.కవిత, ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లూరు ఫణికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో సైన్స్ నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు



ప్రదర్శనలు పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, డీఈవో బాలాజీరావు తదితరులు

రాష్ట్రపోటీలకు ప్రాజెక్టుల ఎంపిక

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన 114 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనకు ఉంచారు. వీరిలో ప్రతిభ చూపిన 6 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వ్యక్తిగత విభాగంలో ఇందుకూరుపేట మండలం కొమరిక జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 9వతరగతి విద్యార్థి వైవీ.షణ్ముక్ తయారుచేసిన గ్లాసెస్ ఫర్ బ్లైండ్ పీపుల్, రాపూరు మండలం కండలేరు ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ 9వ తరగతి విద్యార్థిని తయారు చేసిన ప్రాక్షన్ డిస్క్ ప్రాజెక్టులు, గ్రూప్ విభాగంలో వెంకటాచలం మండలం గొలగమూడి ఎస్‌టీ ఆశ్రమ ఉన్నత పాఠశాల 9వతరగతి విద్యార్థినులు సీహెచ్.దీక్షిత, ఎస్‌కె.కరిష్మాలు తయారు చేసిన యూ టర్న్ యాక్సిడెంట్ ప్రివెన్షన్, టీపీగూడూరు మండలం కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం 10వతరగతి విద్యార్థినులు బి.కీర్తి శ్రీ, బి.రాజశ్రీ లు తయారు చేసిన అప్లికేషన్ ఆఫ్ ట్రిగ్నోమిట్రీ ఇన్ రియల్ లైఫ్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. అలాగే ఉపాధ్యాయుల విభాగంలో వెంకటాచలం మండలం గొలగమూడి ఎస్‌టీ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని పి.అమరావతి తయారు చేసిన రెయిన్ డ్రాప్ సెన్సార్, ఉలవపాడు మండలం వీరంపల్లి ఏపీఎంఎస్ ఉపాధ్యాయిని ఎస్.బింధుమాదవి తయారు చేసిన సీ చేంజ్ కోర్‌వేర్ ప్రాజెక్టులు ఉత్తమంగా నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాయి. వీరంతా త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలతో అధికారులు

రోబోట్‌ను అనుసరించే అడ్డంకి (స్మార్ట్ ట్రాలీ)

విద్యార్థి పేరు : జి.డింపుల్ కార్తీక్
తరగతి : 9వతరగతి
గైడ్ టీచర్ : ఎన్.కామాక్షి
పాఠశాల : జడ్పీహెచ్ఎస్, పెనుబల్లి, బుచ్చిరెడ్డిపాళెం

రోబోట్‌ను నివారించే అడ్డంకి అనేది పూర్తిగా స్వయం ప్రతిపత్తి కలిగిన రోబోట్. ఇది కదిలేటప్పుడు ఎదుర్కొనే అడ్డంకిని నివారించగలదు. సరళంగా ఇది ముందుకు సాగుతున్నప్పుడు అడ్డంకిని ఎదుర్కొన్నప్పుడు స్వయం చాలకంగా ముందుకు సాగడం ఆపి ఒక అడుగు వెనక్కు వేస్తుంది. అడ్డంకి ముందుగా ఏదైనా సమీపంలోని వస్తువు కోసం శోధిస్తుంది. ఒక వస్తువుని కనుగొని దాని దూరాన్ని కొలవడానికి అల్ట్రాసోనిక్ సెన్సార్‌ను ఉపయోగిస్తుంది. బ్యాటరీ, మోటర్‌పై కదిలే ఈ రోబోను సులభమైన రీతిలో వినియోగించవచ్చు. ఇది రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, విమానాశ్రయాల్లో స్మార్ట్ లగేజీ ట్రాలీగా ఉపయోగపడుతుంది.



మురుగునీటి శుద్ధి (వేస్ట్‌వాటర్ ఫిల్టరైజేషన్)

విద్యార్థి పేరు: ఎం.పవిత్ర
తరగతి : 8వతరగతి
గైడ్ టీచర్ : ఆర్.బాబూరావు
పాఠశాల : జడ్పీహెచ్ఎస్ ఇనుకుర్తి, పొదలకూరు మండలం



నీటి శుద్ధీకరణ అనేది అవాంఛనీయ రసాయనాలు, జీవ కలుషితాలు వదిలేయబడిన ఘన పదార్థాలు, వాయువులను నీటి నుంచి తొలగించే ప్రక్రియ. నిర్దిష్ట ప్రయోజనాల కోసం నీటి సుద్ధతను ఉత్పత్తి చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. తాగునీటితో పాటు వైద్య, ఔషధ, రసాయన, పారిశ్రామిక అనువర్తనాలతో సహా పలు ఇతర ప్రయోజనాల కోసం నీటిని శుద్ధి చేస్తుంది. ప్రాజెక్ట్ వినియోగించే పద్ధతిలో వడపోత, అవక్షేపం, స్వేదనం వంటి భౌతిక ప్రక్రియలు అవలంబిస్తారు. అలాగే ఫ్లోక్యులేషన్, క్లోరినేషన్ వంటి రసాయన ప్రక్రియలు, అతినీల లోహిత కాంతి వంటి విద్యుదయ స్కాంత వికిరణం వాడడం వంటివి చేపట్టి ఫిల్టరైజేషన్ చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత.

త్రికోణమితి అప్లికేషన్

విద్యార్థుల పేర్లు : బి.కీర్తిశ్రీ, బి.రాజశ్రీ
తరగతి : 10వతరగతి
గైడ్ టీచర్ : కామాక్షి
పాఠశాల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం (కోడూరు, సర్వేపల్లి)

టెంపుల్, టవర్, బిల్డింగ్, పోల్స్ తదితర ఎత్తైన వాటిని, వస్తువులను త్రికోణమితి అప్లికేషన్ ద్వారా కొలవవచ్చు. మూడు కోణాలతో కోణాలను, లెంగ్త్‌తో కూడిన సమస్యలను పరిష్కరించగలిగిన సామర్థ్యం దీనికి ఉంది. కాంతి త్రిభుజం యొక్క కోణం లేదా అదే సారూప్య త్రిభుజం యొక్క భుజాల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునేలా దీన్ని రూపకల్పన చేశాం. ఎత్తులను కొలవడం, నిర్మాణాలు చేపట్టడం, ఖగోళశాస్త్రం, నావిగేషన్‌లో, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, వీడియో గేమ్‌లలో కూడా ఈ ప్రాజెక్ట్‌లోని అంశాలను ఉపయోగించి సమస్యలు పరిష్కంచవచ్చు. ఈ ప్రాజెక్ట్ ఎన్నో కొత్త ఆవిష్కరణలకు దోహదం చేస్తుంది.



అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్న రెండు దుకాణాల లైసెన్సులు రద్దు

సంగం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగంలో అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్న రెండు దుకాణాలకు పది రోజుల పాటు లైసెన్సులను రద్దు చేసినట్లు ఏవో శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సంగం వచ్చిన జెడీ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయగా ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు దుకాణాల లైసెన్సులను రద్దు చేసినట్లు తెలిపారు. అయితే రైతుల అవసరాల దృష్ట్యా ఆ రెండు దుకాణాలలోని యూరియాను స్వాధీనం చేసుకుని స్థానిక వ్యవసాయ సిబ్బందిచే ఎంఆర్పీ ధరకు విక్రయానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, సంగం, దువ్వూరు పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉందని, యూరియా కావలసిన రైతులు పొలం వివరాలు అందచేసి వీఏఏల ద్వారా పర్మిట్లు రాయించుకుని యూరియా తీసుకెళ్లవచ్చునని తెలిపారు.

రీసర్వే డీటీల పునరుద్ధరణపై హర్షం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న రీసర్వే డీటీలను పునరుద్ధ రిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం హర్షణీయమని ఏపీఆర్ ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కృషి చేశారని తెలిపారు.

నేడు ఎస్సీ వర్గీకరణ కమిషన్ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కులగణన వివరాలు, అభ్యంత రాలను స్వీకరించటానికి రాజీవ్ రంజన్ మిశ్రా చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ సమావేశం శనివారం జరుగుతుందని సోషల్ వెల్ఫేర్ డీడీ కే శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్ట రేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో ఈ సమావేశం ఉం టుందని తెలిపారు. జిల్లాలోని ఎస్సీ పౌరులు, సంఘాల సభ్యు లు అభ్యంతరాలు ఏమైనా ఉంటే రాత పూర్వకంగా సమర్పించాలని కోరారు. కాగా, కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనకు నెల్లూరు ఆర్డీవో అనూష, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి స్వాగతం పలికారు.



ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాజీవ్ రంజన్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి

రేపు వ్యవసాయ ఉద్యోగుల సంఘం సమావేశం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం సమావేశం నెల్లూరులోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యం శాంతరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ శాఖలోని ప్రధాన సమస్యలపై చర్చించడంతోపాటు రాష్ట్ర నాయకుల సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక జరుగుతుందని, ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.

కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం!

మనుబోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచి ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్నం భోజనం పెట్టనున్నారు. 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకానికి వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. తిరిగి ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో డొక్కా సీతమ్మ పేరుతో ఈ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించి అమలు చేయనుంది. జిల్లావ్యాప్తంగా 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, 6,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ఈ పథకం కింద లబ్ధిపొందనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువమంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. వీరంతా మండల కేంద్రాల్లో ఉండే కళాశాలలకు సమీప గ్రామాల్లోని ఇళ్ల నుంచి ఉదయం 7 గంటలకే బయలుదేరి కళాశాలలకు వస్తారు. మధ్యాహ్న భోజనానికి తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్ణయంతో అందరికీ ఊరట కలిగింది.

● **పాఠశాలల ఏజెన్సీలకే బాధ్యత**

ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న ఏజెన్సీలకే కళాశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యతను విద్యాశాఖ అప్పగించింది. జిల్లాలోని మనుబోలు, వెంకటాచలంకు అక్షయపాత్ర సంస్థ, నెల్లూరులోని డికేడబ్ల్యూ, కేఏసీ కళాశాలలకు ఇస్కాన్ సంస్థలకు ఈ పథకాన్ని అప్పగించగా, మిగిలిన 19 కళాశాలల్లో ఏజెన్సీల ద్వారానే భోజనం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఖాకీ పరీక్షలకు సగం మందే!

(5వ పేజీ తరువాయి)

గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో నిరాశ చెందారు. ఇతర పనులు, వ్యాపారాలు, ఉద్యోగాల్లో ఇమిడి పోయారు. దీంతో ప్రస్తుత పరీక్షలపై ఆసక్తి చూపడం లేదు. కాగా, కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో శుక్రవారం మహిళా అభ్యర్థులకు ప్రత్యేకం ఫిజికల్ టెస్ట్ నిర్వహించారు. 417 మందికి 226 మంది హాజరయ్యారు. వీరి కోసం ప్రత్యేకంగా మహిళా పోలీసు అధికారులు, మహిళ సిబ్బందిని ఏర్పాటు చేశారు. మహిళా అభ్యర్థులకు శనివారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగనున్నాయి.

పొగాకు సాగులోనూ డ్రోన్లు

- రైతులకు ఖర్చులు ఆదా
- సస్యరక్షణ చర్యల్లో రాయితీ



డ్రోన్ ద్వారా పొగాకు పురుగుమందు పిచికారీ



డ్రోన్‌లో ద్రావకం నింపుతున్న రైతు

కలిగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : పొగాకు మొక్క నాటడం నుంచి కాల్పు వరకు రైతు అన్నింటా కూలీలపైనే ఆధారపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఎకరా పొగాకు సాగుచేయాలంటే రూ.లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. పొగాకు పనులకు దూరప్రాంతాల నుంచి కూలీలు వస్తారు. అయితే సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటే కూలీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ క్రమంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్ల వినియోగం వాడుకలోకి వచ్చినప్పటికి ఈ విధానంలో ఖర్చు ఎక్కువ అవుతందనే కారణంతో రైతులు ముందుకు రాలేదు. గతేడాది కలిగిరి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో సుమారు 2300 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ విధానంలో సస్యరక్షణ చర్యలు చేపడితే, ఈఏడాదిలో ఇప్పటి వరకు 500ఎకరాల్లో మాత్రమే డ్రోన్ విధానంలో సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లు బోర్డు అధికారులు తెలిపారు. పొగాకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టదలుచుకుంటే ముందుగా స్థానిక వేలం కేంద్రం వద్ద తాము సాగు చేస్తున్న పొలం వివరాలు నమోదు చేసుకుంటే, ఐటీసీ కంపెనీ ద్వారా రాయితీపై రైతులకు డ్రోన్ సౌకర్యం కల్పిస్తామని, ఈ విధానాన్ని రైతులు వినియోగించుకుని సాగు ఖర్చు తగ్గించుకోవాలని బోర్డు అధికారులు తెలియజేస్తున్నారు.

ఖర్చు తగ్గుతుంది...



డ్రోన్ ద్వారా సస్య రక్షణ చర్యలు చేపడితే ఎకరా పొగాకుకు రూ.500 ఖర్చు అవు తుంది. రైతు తన వాటాగా రూ.350 చెల్లిస్తే ఐటీసీ కంపెనీ రూ.150 చెల్లిస్తుంది. ఎకరాలో పురుగుమందు పిచికారీకి 5 నుంచి 10నిమిషాల సమయం పడుతుంది కావున ఖర్చు తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుంది.

- ప్రకాష్, ఐటీసీ కంపెనీ ప్రతినిధి

రైతులకు ఎంతో ఉపయోగకరం



డ్రోన్ ద్వారా రోజుకు 50 ఎకరాలకు పైగా సస్య రక్షణ చర్యలు చేపట్ట వచ్చు. డ్రోన్ విధానం చాలా సులభ తరం, రైతు లకు ఎంతో ఉపయోగకరం. కూలీల కొరతనే ఇబ్బందులు ఉండవు.

- భాస్కరుని సుధాకర్, పొగాకు రైతు



మండలంలోని కోదండరామా పురంకు చెందిన రామిశెట్టి రామ్మూర్తి, ధనమ్మల దంపతులు తమ వ్యవసాయపొలంలో మద్యం దుకాణం ఏర్పాటు కోసం రేకులషెడ్డు ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంను గ్రామంలోని మహిళలు తెలుసుకున్నారు. సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళన చేపట్టారు. పనులు చేపడుతున్న కూలీలను అడ్డుకున్నారు. పొలం పనులకు వెళ్లే ప్రాంతంలో మందు దుకాణం పెడితే ఇబ్బందులు ఎదుర్కొంటామని, అందుకు మేం ఒప్పుకోమని మండిపడ్డారు. పోలీసులు వచ్చి మహిళలకు నచ్చజెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఇరువర్గాలతో స్టేషన్‌లో చర్చించారు.

- జలదంకి, (ఆంధ్రజ్యోతి)



జిల్లావ్యాప్తంగా తెల్లవారుజామున నుంచే పొగ మంచు కప్పేస్తుంది. ఈ సమయంలో బయటకు పని మీద వెళ్లాలన్నా రోడ్డుపైన ఎదురుగా ఏం వస్తుందో తెలియని పరిస్థితి. శ్రీవేంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌ను పొగమంచు కప్పేయడంతో రైలు సిగ్నల్ కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో కూడా పొగమంచును సైతం లెక్క చేయకుండా కీమెన్ ట్రాక్ చెక్ చేసుకుంటూ ముందుకు సాగాడు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

మీ ప్రతిభ విన్నా.. సతీసమేతంగా వస్తా...

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో మహిళా కళాకారుల ప్రతిభ విన్నాను.. సతీసమేతంగా కేంద్రాన్ని సందర్శిస్తానని కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్ హుస్సేన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం సంఘీభావమే బలం ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాదు నోవెటల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులు సందర్శించారు. ఈసందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం స్టాల్‌ను పరిశీలించి మహిళా కళాకారులు తయారుచేసిన వస్తువులను తిలకించారు. ఎంఎస్ఎంఈలో రిజిస్టర్ అయ్యి ఉందా, కేంద్రంలో ఎంతమంది మహిళలు పనిచేస్తున్నారని ఆరా తీశారు. అవసరమైన సదుపాయాల గురించి తన కార్యాలయానికి ఓ నివేదిక పంపాలని, త్వరలో తన సతీమణితో కలిసి చెక్కనగిషీ కేంద్రాన్ని సందర్శించి అన్నివిధాలా అభివృద్ధికి చర్యలు చేపడతానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు నిర్వాహకుడు జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వరికి కేంద్రంలో తయారుచేసిన వస్తువులను అందజేశారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

1 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

● జిల్లా కార్యదర్శి మూలం, మాజీ ఎమ్మెల్సీ విఠపు

నెల్లూరు (వైద్యం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1 నుంచి మూడు రోజులు సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగుతా యని పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సారా వ్యతిరేక, వ్యవసాయ కార్మిక ఉద్యమాలకు జిల్లా ప్రసిద్ధిగాంచిందన్నారు. జిల్లాలో గత 40 ఏళ్లలో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగలేదని, ఈ ఏడాది జరిగే సభలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సీపీఎం ప్రతినిధులు వస్తారన్నారు. మద్దతుదారులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 3వ తేదీన ర్యాలీ జరుగుతుందని, పార్టీ జాతీ య, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటే ప్రస్తుత ఆరు నెలల టీడీపీ పాలనలోనూ అనేక భారాలతో ప్రజలకు తిప్పలు తప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిని రాష్ట్ర మహాసభల్లో ప్రస్తావిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, మూలి వెంగయ్య, మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, మంగళం పుల్లయ్య, తూళ్లూరు గోపాల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు... కోవూరు మండలం పడుగుపాడు స్టాబీడీ కాలనీకి చెందిన లక్ష్మణ్‌సింగ్, చిడ్డిబాయి(64) దంపతులు మందుల కోసం గత నెల 31వ తేదీన బైక్‌పై నెల్లూరుకు వచ్చారు. మందులు కొనుగోలు చేసి కొత్త పెన్నా బ్యారేజ్ మీదుగా కోవూరుకు బయలుదేరారు. పెన్నా బ్యారేజ్ స్పీడ్ బ్రేకర్స్ వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనుక కూర్చొని ఉన్న చిడ్డిబాయి రోడ్డుపై పడింది. ఆమె తలకు తీవ్రగాయం కావడంతో నగరంలోని రామచంద్రారెడ్డి వైద్యశాలకు అక్కడి నుంచి నారాయణ వైద్యశాలకు, ఆ తర్వాత జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. చిడ్డిబాయి కుమారుడు విజయ్‌సింగ్ ఫిర్యాదుతో నార్త్ ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

● పోలీసుల అదుపులో 9మంది

● 4 కోడి పుంజులు, రూ.6400 నగదు స్వాధీనం

కావలి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుడంగుంట కాలనీ సమీపంలోని కోడి పందేల స్థావరంపై శుక్రవారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ తిరుమల రెడ్డి సిబ్బందితో కలసి నిర్వహించిన దాడుల్లో 9మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 4 కోడి పుంజులు, రూ.6,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుమల రెడ్డి తెలిపారు. గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, గంజాయి అమ్మకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7456
వెండి కిలో ధర	రూ. 90,400
వెండి ఒక గ్రాము	రూ.98.40

వైరస్ బారిన మిరప

● పెరుగుతున్న పెట్టుబడి.. దిగుబడిపై తీవ్ర ప్రభావం

● ఆపై ధరలేక అన్నదాత కుదేలు

అనంతసాగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైరస్.. మిరప రైతుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. చేతికందిన పంటకు నల్లతామర పురుగు, తెల్లదోమ (వైరస్) సోకడంతో అల్లాడి పోతున్నారు. తెగుళ్ల కారణంగా ఏడాదికేడాది పంటసాగులో తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. 2022 వరకు బొమ్మవరం, అగ్రహారం, చాపురాళ్లపల్లి, యాకర్లపాడు, గోగులపల్లి, సంజీవనగరం, గౌరవరం, కామిరెడ్డిపాడు, చిలకలమర్రి గ్రామాల పరిధిలో సుమారు 1000 నుంచి 1600 ఎకరాల వరకు సాగు చేసేవారు. వైరస్ కారణంగా అధిక పెట్టుబడులు వెచ్చించలేక విస్తీర్ణం తగ్గించేశారు. ప్రస్తుతం 500 ఎకరాల్లో మాత్రమే మిరప సాగు అవుతున్నట్టు అంచనా.



వైరస్ సోకిన మిరప తోట

● ఎకరాకు లక్షపైనే పెట్టుబడి

ఒక ఎకరాలో మిరప సాగు చేయాలంటే రూ.లక్ష నుంచి 1.2 లక్షలు ఖర్చు అవుతున్నట్లు సాగుదారులు చెబుతున్నారు. వైరస్ దాడితో పెట్టుబడులు అధికమవు తున్నాయని, ప్రతి మూడు రోజులకొకసారి రూ.2 వేల నుంచి 4 వేలు విలువ చేసే మందులు వాడాల్సిన పరి స్థితి ఉన్నట్లు వాపో తున్నారు. ఈ ఏడాది నల్లతామర పురుగు, తెల్ల దోమ ఉధృతి తగ్గకపోవ డంతో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తోటలు వది లేయగా, మిగిలిన చోట్ల తాలి కోత వచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం మనుము (11 కేజీల 200 గ్రాములు) ధర రూ 200 పలుకుతుండగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాక సాగుపై పెట్టిన ఖర్చు ఎలా రాబట్టుకోవాలో అర్థం కాక అన్నదాతలు ఆందోళనలో పడ్డారు.

కృష్ణపట్నం సర్పంచు చెక్ పవర్ రద్దు

ముత్తుకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణపట్నం పంచాయతీ సర్పంచు మోచర్ల వజ్రమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. కృష్ణపట్నం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గతంలో పని చేసిన ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన విచారణలో భాగంగా రికార్డులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిధులు డ్రా చేసేం దుకు వీలు లేకుండా సర్పంచు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో సాధారణ పనులు ఇతర అవసరాల నిమిత్తం నిధులు మంజూరు చేసేందుకు వీలుగా ముత్తుకూరు ఈవోఆర్డీకి చెక్ పవర్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

వెంకటాచలం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం జాబ్‌మేళా జరిగింది. వీఎస్‌యూ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 47 మంది యువత హాజరవ్వగా 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, కోఆర్డినేటర్ డాక్టర్ జే.విజేత, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలేటు పాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. మద్యం అమ్ముతున్న సయ్యద్ సుభానీని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ ప్రభాకర్‌రావు, కానిస్టేబుళ్లు కృష్ణయ్య, రాజాజీ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములు కబ్జా చేస్తే చర్యలు

● జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్

పొదలకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన భూములను ఎవరైనా కబ్జా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని దుగ్గుంట, పెద్దరాజుపాలెం, కొనగలూరు, పొదలకూరులోని మసీదులను ఆకస్మిక తనిఖీ చేశారు. వక్ఫ్‌బోర్డు భూము లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఆదాయం లేని మసీదుల్లో ఇమామ్, మౌజన్లకు ఇచ్చే గౌరవ వేతనం చాలా చోట్ల పక్కదారి పడు తుందని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మసీదులను పరిశుభ్రంగా ఉంచుకొని 5 పూట్ల నమాజ్‌తో పాటు హజా ఇవ్వాలన్నారు. మసీదుల అధ్యక్షులు నగదుకు సంబంధించిన వివరాలు రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మండలంలోని దుగ్గుంట, తాటపర్తి, మహమ్మదాపురంలో వక్ఫ్‌బోర్డు భూములను ఆయన పరిశీలించారు. దుగ్గుంటలోని సర్వే నెంబరు 332, 356/1, 133లో భూములను ఇతరులు కబ్జా చేసి ఉన్నారని, వారికి నోటీసులు ఇచ్చి రెవెన్యూ అధికారుల సాయంతో ఆ భూములను స్వాధీనం చేసుకుంటామ న్నారు. జిల్లాలో గౌరవ వేతనం పొందు తున్న 440 మసీదులు ఉన్నాయని, అలాగే 2200 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయని తెలిపారు. కబ్జాకు పాల్పడిన వారిపై క్రిమి నల్ చేర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జమీర్, టీడీపీ మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఉన్నారు.

100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ దేవిక సిబ్బందితో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. కడనూతల, కప్పరాళ్లతిప్ప, గంగ తిప్ప, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం పరిధిలోని అటవీప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. తిప్పగ్రామానికి దక్షిణాన ఉన్న నక్కల గుంట వద్ద నాటుసారా తయారీకి నిల్వ ఉంచిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

హాజరు లేకపోతే జీతాల్లో కోత

నెల్లూరు (వైద్యం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకాకపోతే జీతాలలో కోత తప్పదని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందితో నెలావారీ సమీక్ష జరిపారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. సక్రమంగా ముఖ హాజరు వేస్తూ, బాధ్యతగా విధులు నిర్వర్తించా లని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్లు నిబద్ధతతో పనిచేసి నమూనాల పరీక్షల్లో కచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి ఉమామహేశ్వరి, జిల్లా గణాంక అధికారి సహన పాల్గొన్నారు.

టవర్ గుంత ఓ బిడ్డ ప్రాణం తీసింది

● కావలిలో 4వ తరగతి విద్యార్థి మృతి



చక్రధర్ (ఫైల్)

కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలక్రిష్ణారెడ్డినగర్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థి పోనమల్లి చక్రధర్ (8) శుక్రవారం టవర్ కోసం తీసిన గుంతలో పడి మరణించాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో ఉంటున్న గిరిబాబు, అమృతలకు ఎనిదేళ్ల కుమారుడు గిరిధర్, 3నెలల పాప ఉన్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లిన చక్రధర్ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. కొద్దిసేపు ఉండి మరలా పాఠశా లకని వెళ్లాడు. సాయంత్రం తన కుమారుడు రాకపోవడంతో తల్లి కంగారు పడింది. బంధువుల సాయంతో చుట్టుపక్కల ఆరా తీసింది. సాయంత్ర అయినా కుమారుడు కనిపించక పోవడంతో ఈ సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఫోన్ ద్వారా తెలిపింది. ఎస్ఐ తిరుమల రెడ్డి సిబ్బందితో బాలక్రిష్ణారెడ్డినగర్ చేరుకున్నారు. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు చుట్టుపక్కల వెతికాడు. ఎక్కడా ఆచూకీ తెలియలేదు. ఈ సమయంలో ఇంటికి సమీపంలోని ఓ లేఅవుట్‌లో వర్షాలకు ముందు టవర్ నిర్మాణం కోసం తీసిన గుంటపై పోలీసులకు అనుమానం వచ్చింది. అక్కడకు చేరుకుని స్థానికులతో గుంతలో వెతికించగా విద్యార్థి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. పాఠశాలకు వెళ్లిన కుమారుడు విగత జీవుడై కనిపించటంతో టవర్ గుంట తమ బిడ్డను పొట్టన పెట్టుకుందంటూ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు ఎస్ఐ తిరుమల రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి


ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్ర వారం ఆయన క్షేత్రంలోని ఆలయ పరిసరాలను పరిశీలిం చారు. అంతకు ముందు స్వామి, అమ్మ వార్లను దర్శించు కున్నారు. ఆయన వెంట ఈవో రాధాకృష్ణ, మాజీ ఆలయ పాలకమండలి చై ర్మన్ శ్రీరామ్ మాల్యాద్రితో పాటు మండల సర్వేరు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, ముంతాల వెంక య్య, వెంకటేశ్వర్లురెడ్డి, ఆదిశేషయ్య, రామిరెడ్డి, వేంకటేశ్వర్లు, ప్రభాకర్ ఉన్నారు.

మెట్టకు మణిహారాలు ఈ రాజమార్గాలు

ముమ్మరంగా జాతీయ రహదారుల పనులు

● సీతారామపురానికి చుట్టూ మూడు హైవేలు


సీతారామపురం-ఉదయగిరి మార్గంలో జరుగుతున్న ఎన్‌హెచ్ 167-బీజీ జాతీయ రహదారి పనులు

సీతారామపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన సీతారామపురం మండలానికి ఎన్‌హెచ్ 167-బీజీ దుత్తలూరు- ఉదయగిరి, ప్రకాశం జిల్లా సింగరాయకొండ నుంచి సీతారామపురం మీదుగా కడప జిల్లా మైదుకూరు వరకు ఎన్‌హెచ్ 167-బీ, బెంగళూరు నుంచి విజయ వాడ ఎన్‌హెచ్- 544 జి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారులు సీతారామపురం గ్రామానికి చుట్టూ మణిహారం లాగా పనులు శరవేగంగా జరుగు తున్నాయి. దుత్తలూరు నుంచి ఉదయగిరి మీదుగా సీతారామపురం వరకు 36.4 కిలోమీటర్ల మేర రూ.310 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జాతీయ రహదారి (167-బీజీ) పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 70శాతం పనులు పూర్తి చేశారు. పలుచోట్ల వంతెనల నిర్మాణం జరుగుతోంది. ఎన్‌హెచ్- 544 జి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు పూర్తయితే కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బెంగళూరు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు సులభతరవుతుంది. వ్యాపారాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ రహదారి నిర్మాణంతో మెట్ట భూముల ధరకు రెక్కలొచ్చాయి. గతంలో రహదారికి సమీపంలో ఉన్న ఎకరా భూమి రూ.5 లక్షల నుంచి రూ. 7 లక్షలు పలికేది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో రూ.25 లక్షల నుంచి 30 లక్షలు పలుకుతోంది. సీతారామపురం రహదారి పక్కనే బారీ లేఆవుట్లు వేసి ప్లాట్ల విక్రయాలకు సైతం సిద్ధమవుతున్నాయి. ఏదిఏమైనా జాతీయ రహదారి నిర్మాణంతో మెట్ట ప్రాంత అభివృద్ధితో పాటు స్థానిక ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది.

న్యూస్ బాక్స్

ఉర్దూ పాఠశాలల తనిఖీ


విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న ఖాజా మొహిద్దీన్

సంగం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జెండా దిబ్బ, దువ్వూరు, సంగంలోని ఉర్దూ పాఠశా లలను శుక్రవారం జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజా మొహిద్దీన్ తనిఖీ చేశారు. జెండాదిబ్బలో ఉర్దూ పాఠశా లలో విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీ లించారు. అనంతరం విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతిరోజు యాప్‌లో విద్యార్థుల అటెండెన్స్ సకాలంలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ తిరునాళ్ల

అల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బలిజపాలెంలో వెలసిన మహాలక్ష్మమ్మ తిరునాళ్లను శుక్రవారం భక్తు లు వైభవంగా నిర్వహించారు. గత ఇరవై ఏళ్లుగా నిలిపివేసిన తిరునాళ్ల తిరిగి ప్రారంభించి అమ్మవారికి ఉదయం పొంగళ్లు పొంగించి నైవేద్యాన్ని సమర్పించారు. ఉద యం నుంచి అభిషేకాలు, పూజలు చేసి రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి ప్రత్యేక పూలతో విద్యుత్ దీపాలంకరణ శోభాయమానంగా తీర్చిదిదారు. గతంలో జరిగిఇన వివాదాల నేపథ్యంలో కావలి రూరల్ సీఐ పాపారావు ఆధ్వర్యంలో ఎస్ఐ కిషోర్‌బాబు సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వింజమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ ఎస్ఎం) ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్ ఉన్న త విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తి ఉన్నత విద్యామండలి కార్యా లయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్‌ఎస్ఎం రాష్ట్ర అధ్య క్షుడు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డిఎస్‌విఎస్ బాలసుబ్ర హ్మణ్యం, డిగ్రీ కళాశాల విభాగం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ కె బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఎంసి చైర్మన్‌లకు శిక్షణ

సీతారామపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభి వృద్ధి సాధ్యమని మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి తెలిపారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్ర వారం ఎస్ఎంసి చైర్మన్‌లకు, ప్రధానో పాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహి ంచారు. ఈకార్యక్రమంలో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ విధులు, బాధ్యతల గురించి ఆర్‌పిలు పిడతల సుధాకార్, కలివెల రవిచంద్ర వారికి వివరించారు. కార్యక్ర మంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, శిగే కొండయ్య, షేక్ షఫీ ,వి, అంజయ్య,సిఆర్ఎంటి లు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన

కలిగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దనకొండూరులో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానవన జిల్లా అధికారి ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొని ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ, రాయితీతో డ్రిప్ పరికరాల వివ రాలను తెలిపారు. కార్యక్రమంలో 3ఎఫ్ కం పెనీ ఏజీఎం సూర్యనారాయణ, వింజ మూరు ఉద్యాన అధికారి షేక్ షహీల్, వీహెచ్ఏ వెంకటరత్నం, 3ఎఫ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సాయిరాం, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

కందుకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోతురాజుమిట్ట సెంటర్‌లోని హిం దూ శ్మశాన వాటిక అభివృద్ధికి వీపీజీ జ్యూయలర్స్ అధినేత వేముల సుకుమార్ గుప్తా శుక్రవారం ఆర్యవైశ్య యువకులకు రూ.4,11,116లను అందజేశారు. ఈ నగదు తో శ్మశానవాటికలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో వేముల తిరుమలరావు, పార్థు, ఆర్యవైశ్యనాయకులు మురారిశెట్టి సుధీర్ కుమార్, గుర్రం అల్లూరయ్య, బొగ్గవరపు బాలనరసింహ పాల్గొన్నారు.

కావలి నుంచి జొన్నవాడకు ఆర్టీసీ బస్సు ప్రారంభం


జొన్నవాడ బస్సును ప్రారంభిస్తున్న భక్తురాలు లక్ష్మీసంపూర్ణమ్మ

కావలి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కావలి నుంచి జొన్నవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం డిపో మేనేజర్ రాహూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జొన్న వాడ కామాక్షితాయి భక్తురాలు ద్రోణా దుల లక్ష్మీసంపూర్ణమ్మ ప్రారంబించారు. ప్రతి శుక్రవారం భక్తుల విన్నపం మేరకు తిరిగి సర్వీసును ప్రారంభించామన్నారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ మేనేజర్ కల్పన, కార్యా లయ మేనేజర్ విజయకుమారి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, బస్టాండ్ మేనేజర్ రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జి క్యూటివ్ రవిప్రకాష్, బీసీ భవన్ అధ్యక్ష కార్యదర్శులు అద్దంకి ప్రభాకర్, చిన్ని వరప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

కావలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు మెరు గైన వైద్య సేవలు అందించాలని ఎమ్మె ల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థాని క వైద్యశాలలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహిం చారు. కొంతకాలంగా పేరుకుపోయిన సమ స్యలపై అధికారులతో చర్చించారు. ఆసు పత్రిలో తాగునీటి సరఫరా, విద్యుత్ సర ఫరా సమస్యలను అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభు త్వం బిల్లులు ఇవ్వలేదని కాంట్రాక్టర్ అసం పూర్తిగా భవన నిర్మాణం చేపట్టారని తెలి పారు. ఆసుపత్రి షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగించుకునే వారు సక్రమంగా అద్దె లు చెల్లించలేదని వాపోయారు. కార్యక్ర మంలో సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ ఎంవో ప్రమీల, అభివృద్ధి కమిటీ సభ్యులు చవల రామక్రిష్ణ, ఏటూరి శివ, పొబ్బా సాయి, ఆత్మకూరి నాగలక్ష్మీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుచేస్తా : కాకర్ల

వింజమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మె ల్యే కాకర్ల సురేష్ తెలిపారు. శుక్రవారం వింజమూరు ఆటోమొబైల్స్ డీలర్స్ టెక్నికల్ వర్క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకినపల్లి రఘురామిరెడ్డి, సెక్రటరీ గువ్వల రవీంద్రా రెడ్డి, కార్యదర్శులు కదిరి రంగారావు, మ హేంద్ర ట్రెజరీ బ్రహ్మయ్య, తదితరులు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి త్వరలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తామన్నారు.

గండిపాళెంలో రెవెన్యూ సదస్సు

ఉదయగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో శుక్రవ ారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో ప్రజలు, రైతు లు పలు సమస్యలపై అర్జీలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ జహీర్, ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో బిల్లుపాటి వెంక టేశ్వర్లు, సర్వేయరు శ్రీకాంత్ పాల్గొన్నారు.

● దుత్తలూరు : మండలంలోని తెడ్డు పాడు గ్రామంలో శుక్రవారం తహసీల్దారు వై నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సులో పలువురు సమ స్యలపై అర్జీలు అందజేశారు.

వైద్యాధికారులకు సత్కారం

అనంతసాగరం, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): జిల్లా వైద్యశాఖాధికారి సుజాత, ఉప వైద్యాధికారి ఖాదర్‌వలిని శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వైస్ ప్రెసి డెంట్, అనంతసాగరం పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ షేక్ మీరాన్ ఆధ్వర్యంలో సత్క రించారు. కార్యక్రమంలో యూనియన్ నా యకులు నాగరాజు, రెడ్డప్ప, నరేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సంగం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంగం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి ఆధ్వర్యంలో శుక్ర వారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు శ్రీనివాసులు, కమ్యూనిటీ హెల్త్ అధికారి ఇందిర పాల్గొన్నారు.


ఉదయగిరి:: సావిత్రిబాయిపూలేకు నివాళులర్పిస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు


ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయబృందం

సావిత్రీబాయి పూలే సేవలు మహిళలకు ఆదర్శం

ఆత్మకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తొలి భారతీయ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే సేవలు మహిళలకు ఆదర్శమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు అనంత లక్ష్మీ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్ర వారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావి త్రీబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అనంతసాగరం : కామిరెడ్డిపాడు, చిలకలమర్రి ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం ఉపాధ్యా యులను సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వసుంధరాదేవి, సురేష్ పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులు రుక్సానాబేగం, శైలజా, భార్గవిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ లక్ష్మీ పాల్గొన్నారు.

● చేజర్ల : మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఆదురుపల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఐ గణపతిరెడ్డి, చెంచురత్నం జ్ఞాపకార్థం మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎన్ రమణయ్య, సుబ్రమణ్యం, ఎమ్ రవిబాబు పాల్గొన్నారు.

● ఉదయగిరి: బిజ్జంపల్లి గ్రామంలో శుక్రవారం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు నాయబ్‌రసూల్, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు అన్వర్, ఫరీద్‌బాషా, బాలకృష్ణ, ఫరీద్, నారాయణ పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో మస్తాన్‌వలి ముఖ్య అతిథిగా హాజరై సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంగయ్య, సుధాకరయ్య, బాష, జయరామిరెడ్డి, వాణి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలకొండలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయినులు ఏ సుభాషిణి, పి సీతా మహాలక్ష్మీ, షేక్ షమీలాబేగంలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి సురేష్, లక్ష్మయ్య, మహేష్, శ్రీరాములు, పాల్గొన్నారు.

● కావలి టౌన్: ఎంఈవో గోవిందయ్య ముసునూరులోని గిరిజన బాలికల వసతిగృహ పాఠశాలను సందర్శించారు. సావిత్రబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

●కొండాపురం : సమాజంలో అణగారిన మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి మరువలేనిదని మండల విద్యాధికారులు -1, 2లు కె.రవికుమార్, ఆనందరావులు తెలిపారు. మండల విద్యావనరులకేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

● బిట్రగుంట: కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు అపోలో ఆస్పత్రి వైద్యురాలు స్రవంతిని కళాశాల మహిళ అధ్యాపకులు సన్మా నించారు. ఏనుగులబావి ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. విశ్వనాథరావుపేట బాలికల ఉన్నత పాఠశాలలో అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపకురాలు జీ.బాలశైలజ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

● కందుకూరు: స్థానిక బీటీఏ కార్యాలయంలో బీటీఏ కందుకూరు డివిజన్ నాయకులు కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కళ్లగుంట మోహనరావులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కళ్లగుంట మోహనరావు, కసుకుర్తి అంజయ్య, వలేటి మాలకొండయ్య, ధన్యాసి కోటేశ్వరరావ పాల్గొన్నారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాజగోపాలబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీని వాసరావు, షేక్ షహనాజ్‌బేగం, నరేష్‌రాజా, పద్మావతి, కరుణ రత్నకుమార్, బాలూ నాయక్ పాల్గొన్నారు. అలాగే న్యాయవాది ముప్పవరపు కిషోర్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

● లింగసముద్రం: పెంట్రాల యూపీ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు శ్రీనివాసులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు హైమారాణి, సంధ్యారాణి, విద్యార్థి తల్లి మాధురిలను సన్మానిం చారు.

● ఉలవపాడు: ప్రాథమిక పాఠశాలలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంజమ్మ, కామేశ్వరి, కార్యకర్త ఇందిరమ్మ, మాజీ సర్పంచులు గురజాల ప్రసాదరావు, దార్ల కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు బాబ్జీ, పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి గౌరవ సత్కారం చేశారు.


కావలి టౌన్: సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఎంఈవో గోవిందయ్య


సీతారామపురం : టీచర్లను సత్కరిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి



కందుకూరులో బీటీఏ నాయకులు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రాజా డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీ యూ కార్యాలయంలో శుక్రవారం సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ పాల్గొని సమస్యలు, వాటి పరిష్కార మార్గా లపై చర్చించారు. ఈనెల 21న నెల్లూరులో నిర్వహిస్తున్న రవాణారంగ కార్మికుల సద స్సుకు డివిజన్ నుంచి అధికసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా నరసింహ, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా చెంచురామయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్కే. బాజీ, కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ప్రతాప్, మహేష్ లను ఎన్నుకున్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఆత్మకూరు ,జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రిమూరి మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ శుక్రవారం ఆత్మకూరు న్యాయ వాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, న్యాయవాది వెంక టేశ్వర్లు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది శేషాద్రిమూరి మృతికి కారణమైన త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను వెంటనే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ కేసుల్లో జోక్యం చేసుకోవద్దన్న సుప్రీంకోర్టు ఆదేశాలను సీఐ శాంతిలాల్ ఖాతరు చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగం రైతులకు లాభదాయకం


డ్రోన్‌తో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు

కలువాయి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ వినియోగం రైతులకు లాభ దాయకం అని వ్యవసాయాధికారి వీ ప్రతాప్ పేర్కొన్నారు. మండలంలోని లలితానగర్‌లో వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో శుక్రవారం సాగులో ఉన్న వరి పైరుపై కీటక నాశిని పురుగుమందును డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. గ్రామానికి చెందిన రామ్మోహన్‌రావు, హజరత్తయ్య పొలాల్లో ప్రయోగాత్మకంగా డ్రోన్ ద్వారా 10లీటర్ల పురుగు మందును కేవలం 7 నిమిషాల్లోనే ఎకరాలో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వీ ప్రతాప్ మాట్లాడుతూ కూలీల సమస్యను అధిగమించ డంతో పాటు రైతులకు డబ్బు కూడా ఆదా అవుతుందన్నారు. ఎకరాకు రూ.300 తీసుకుం టునట్లు, 80శాతం రాయితీతో మండలానికి ఒకటి చొప్పున రైతు గ్రూపులకు ప్రభుత్వం డ్రోన్లు అందజేయాలని నిర్ణయించి నట్లు ఆయన తెలిపారు. డ్రోన్ స్ప్రేలో 20శాతం నానో యూరియా కూడా కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వసతిగృహాల మరమ్మతులకు నిధులు మంజూరు

మర్రిపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వసతిగృహాల మరమ్మతుల కోసం రూ. 8కోట్లు మంజూరైనట్లు వన్ మ్యాన్ కమిషన్ చెర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలను శుక్రవారం ఆయన సందర్శించారు. వసతులపై ఏఎస్‌డబ్ల్యూ, వార్డెన్‌లతో ఆరాతీశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట జిల్లా లైజినింగ్ అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

సంగం పీఏసీఎస్ తనిఖీ

సంగం, జవవరి 3 (ఆంధ్రజ్యోతి): సంగంలోని ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘాన్ని జిల్లా సహకార సంఘం డీసీవో గుర్రప్ప శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీలో నిల్వ ఉన్న యూరియా, స్టాక్ వివరాలు తెలుసుకుని రికా ర్డులను పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోలు బంకు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సొసైటీ సెక్రటరీ దస్తగిరి, సిబ్బంది బాలకృష్ణ ఉన్నారు.

జాబ్‌మేళాలో 13 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉదయగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 13 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రీన్‌టెక్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, అధ్యాపకులు అక్మల్, విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.

వెంగళాపురంలో పారిశుధ్య పనులు చేపట్టండి

లింగసముద్రం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వెంగళాపురం గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్, సీహెచ్ఓ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సందర్శించారు. గ్రామంలోని మురుగు కాలు వల్లో నీరు నిల్వ ఉంటున్నట్లు, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. రెండు రోజుల్లో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని సర్పంచు మల్లికార్జున, కార్యదర్శి సాయికిరణ్‌కు సూచించారు. అలాగే మురుగు కాలువల్లో ఎబేట్ మందు స్ప్రే చేయించాలని ఆరోగ్యశాఖ అధికారులకు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది డాక్టర్ రమేష్ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్యోగ్య సిబ్బంది స్వాతి, ఆశావర్కరు వెంకటరమణ ఉన్నారు.

సావిత్రి బాయి సేవలు నిరుపమానం

- ఆర్ఐవో శ్రీనివాసులు
- తొలి ఉపాధ్యాయినికి ఘన నివాళి


డీకే జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు


సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు


వెంకటాచలం : సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత


పొదలకూరు : సావిత్రిబాయి పూలేకి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నెల్లూరు(విద్య), జనవరి 3(ఆంధ్రజ్యోతి): దేశంలో బాలికా విద్య కోసం విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే ఆదర్శనీయురాలని, ఆమె సేవలు నిరుపమానమని ఇంటర్ విద్యాశాఖ ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు కొనియాడారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా నగరంలోని పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. మినీబైపాస్‌లోని పూలే దంపతుల విగ్రహాలకు పలు పార్టీలు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఐవో ప్రసంగించారు. భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రి బాయి సమాజంలోని మూఢనమ్మకాలను లెక్కచేయకుండా ఎన్నో అవమానాలను భరించి మహిళా విద్య కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సావిత్రిబాయి విగ్రహానికి ఏడీ ప్రసన్నలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, నగర అధ్యక్షుడు పెంచల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి తలారి మల్లికార్జున పాల్గొన్నారు.

● కొత్తకాలువ ఎంపీపీఎస్ పాఠశాల, మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, కొండాయపాళెంలోని నగరపాలక పాఠశాలలో సావిత్రి బాయికి పుష్పాంజలి ఘటించారు. నెల్లూరు అర్బన్, రూరల్ ఎంఈవోలు అబ్దుల్ హమీద్, తిరుపాల్, హెచ్ఎంలు శశికళ, పార్థసారథి, భాస్కర్‌రావు, బీటీఏ నాయకుడు హరి, ఆర్‌టీఏ అధ్యక్షుడు షేక్ ఖాజా రహంతుల్లా, కార్యదర్శి కిరణ్‌కుమార్, మహిళా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు డాక్టర్ రాజేశ్వరి తదితరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు.

● నెల్లూరుకు చెందిన మహిళా యోగా గురువు డాక్టర్ జేకే స్వప్న ఉత్తమ మహిళా గురువుగా పురస్కారం పొందారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని విజయవాడలో జరిగిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సినీ నటి రేణూ దేశాయ్ నుంచి ఆమె అవార్డు, సర్టిఫికెట్ అందుకున్నారు.

● నెల్లూరు,(సాంస్కృతికం): సావిత్రిబాయి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని నెల్లూరు జిల్లా సామాజిక సమరసత వేదిక మహిళా ప్రముఖ్ అన్నం భవానమ్మ ప్రభుత్వాన్ని కోరారు. పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, జయప్రకాష్, దాసరి రాజేంద్ర, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు,(హరనాథపురం): ఆధునిక సమాజ దార్శనికురాలు సావిత్రిబాయి అని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు రఘురాం ముదిరాజ్ అన్నారు. నగరంలోని సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, అరిగెల సాయిరాం, కనకరాజు, జీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, బీసీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయికి నివాళులు అర్పించారు. ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కో-కన్వీనర్ లీలామోహన్ పాల్గొన్నారు.

జనసేన నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి): పూలే దంపతుల విగ్రహాలకు జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగ వివక్షను రూపుమాపేందుకు, బాలికా విద్యకు సావిత్రిబాయి చేసిన కృషి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుందర రామిరెడ్డి, కారంపూడి కృష్ణారెడ్డి, కొండాపురం కస్తూరి, నందని యాదవ్, పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో...

వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ సేవా పథకం యూనిట్-3,4 ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్ రావు పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆ కాలంనాటి అడ్డంకులు అధిగమించి భర్త సహకారంతో తాను నమ్మిన విలువల కోసం నిలబడి గెలిచిన తీరు ప్రశంసనీయమన్నారు. ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో...

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఊకోటి లక్ష్మీనారాయణ, నాయకులు తుమ్మల శ్రీనివాసులు, పముజుల శంకరయ్య, వెంపులూరు శ్రీనివాసులుగౌడ్, తుమ్మల ప్రసాద్, బత్తూరి మురళీ, పైడాకుల సుధాకర్, కోడూరు మస్తానయ్య, గుమ్మ మోహన్, ఆడిగోపుల శేషయ్య, తుమ్మల శ్రీహరి, రమణయ్య పాల్గొన్నారు.

● స్థానిక నాగార్జున స్కూల్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి స్కూల్ చీఫ్ అడ్వైజర్ అన్నం సుబ్బారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదుర్గా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో జయంతి



టీడీపీ జిల్లా కార్యాలయంలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయి జయంతి వేడుకలు జరిగాయి. ఆమె చిత్రపటానికి రాష్ట్ర సాధికారిక కన్వీనర్ పీఎల్ రావ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె జీవిత విశేషాలను కొనియాడారు. చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఆసం సురేష్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి విజయమ్మ, తెలుగురైతు నాయకులు సారంగం గున్నయ్య, బీసీ నాయకులు అంకయ్య, ఉదయగిరి అనిల్ కుమార్, నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

● సీపీఎం అనుబంధ సంస్థ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుర్గిరాల అన్నపూర్ణమ్మ, ఐద్వా నగర అధ్యక్షురాలు సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఆర్‌సీ 9వ వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాళెం పంచాయతీ అనుపల్లిపాడు రైల్వే గేటు వద్ద ఉన్న సంయుక్త ప్రాంతీయ కేంద్రం (సీఆర్‌సీ) 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిందాల్ పవర్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సహకారంతోనే ఈ ప్రాంతంలో సీఆర్‌సీ ఏర్పాటయిందన్నారు. ఆయన దూరదృష్టి, విలక్షణ ఆలోచన శైలితో మండలంలో ఐదు కేంద్ర సంస్థలు ఏర్పాటయ్యాయన్నారు. జాతీయస్థాయి ప్రమాణాలతో సేవలందించే సీఆర్‌సీ తన నియోజకవర్గంలో ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం క్యూర్ ఇండియా వారి సర్వీస్ సెంటర్‌ను సీఆర్‌సీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పారా ఒలంపిక్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్, ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, స్వప్న, మస్తాన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయండి

తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని, అందులో భాగంగా బడి బయట ఉన్న గిరిజన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. నాయుడు దశరథరామిరెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా తోటపల్లిగూడూరు హైస్కూల్‌లో శుక్రవారం చేపట్టిన విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నాయుడు నాగేశ్వరమ్మ ట్రస్ట్ ద్వారా నాయుడు ఆదికేశవులరెడ్డి విద్యార్థులకు అందిస్తున్న చేయూత అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, సొసైటీ మాజీ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి, కొణతం రఘుబాబు, ఇనుకపాలెం సర్పంచి ఇంగిలాల చైతన్య, చేవూరు శ్రీనివాసులు, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, పోతన, అవినాష్, వెంకటేశ్వర్లు, సుధీర్ పాల్గొన్నారు.

ఆ కార్యదర్శులకు 'షోకాజ్' ఇవ్వండి

● కమిషనర్ సూర్యతేజ


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శానిటేషన్, ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 52వ డివిజన్ ఇసుక డొంక, గోపురం వీధి సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. శానిటేషన్, ప్లానింగ్ సెక్రటరీల పనితీరు సరిగా లేదని, వారి నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకోవాలన్నారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద సచివాలయాలను ఏర్పాటు చేసి అక్కడి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం తాగునీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు.

కార్మికుల ఆందోళన : కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. గత సమ్మె కాలంలో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మేయర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలూరు, వేమిరెడ్డికి టీడీపీ శాశ్వత సభ్యత్వాలు



ఎమ్మెల్యే నుంచి సభ్యత్వం అందుకుంటున్న సురేంద్రరెడ్డి, శాశ్వత సభ్యత్వం చూపుతున్న పోలూరు సుబ్బయ్య

నెల్లూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శాశ్వత సభ్యత్వాలను ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు పోలూరు సుబ్బయ్య, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి శుక్రవారం అందుకున్నారు. పార్టీకి రూ.లక్ష చెల్లించి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నుంచి సభ్యత్వ కార్డులను పొందారు. 1982లో టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీతో నడుస్తున్నానని అల్లీపురం మాజీ సర్పంచ్ పోలూరు సుబ్బయ్య తెలిపారు. కోటంరెడ్డి సోదరుల ఆదేశానుసారం సభ్యత్వం పొందినట్లు దేవరపాళేనికి చెందిన వేదగిరి క్షేత్ర మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ భవనం పూర్తికి కృషి : ఎంపీ బీద


బీద మస్తాన్‌రావును సన్మానిస్తున్న బొమ్మి నాగకిషోర్, తదితరులు

నెల్లూరు (హరనాథపురం/వ్యవసాయం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బీసీ సంక్షేమ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయించడానికి కృషి చేస్తానని ఎంపీ బీద మస్తాన్‌రావు చెప్పారు. ఆయన రెండోసారి రాజ్యసభకు ఎంపికైన నేపథ్యంలో శుక్రవారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సన్మానం జరిగింది. జిల్లా యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ బొమ్మి నాగకిషోర్ యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మస్తాన్‌రావు మాట్లాడుతూ కుల గణనను ప్రభుత్వం త్వరితగతిన చేపట్టే విధంగా రాజ్యసభలో ఒత్తిడి తెస్తానని చెప్పారు. కార్యక్రమంలో లాక వెంగళరావు, కనకట్ల రఘురాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలోని బీసీల సమస్యల పరిష్కారంతోపాటు చేనేత భవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ ఎంపీ మస్తాన్‌రావును కోరారు. శుక్రవారం నగరంలోని బీద నివాసంలో పద్మశాలి సంఘం, బీసీ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. బీసీ సంఘం అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు, సోమగోపాల్, సోమ రాధ, మాజీ కార్పొరేటర్ లలితారాం తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్‌రావును కలసిన మాజీ ఎంపీపీ

విడవలూరు,(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుని విడవలూరు మాజీ ఎంపీపీ ఓగు నాగేశ్వరరావు శుక్రవారం నెల్లూరులోని అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

యశస్వినికి ఎమ్మెల్యే కోటంరెడ్డి అభినందన

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖ పట్నంలో జరిగిన స్టేట్ లెవల్ కరాటే పోటీలో బంగారు పతకం సాధించిన పీ యశస్వినిని శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ అభినందించి సత్కరించారు. యశస్విని ఉన్నతికి సహాయ సహకారాలు అందిస్తామని శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయ మాజీ ధర్మకర్త వరద పవన్‌కుమార్, కరాటే మాస్టర్ షేక్ షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరి ఆలయ అభివృద్ధికి సహకారం

నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి, వేద పండితుడు రామకృష్ణ తదితరులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయంలో నవగ్రహ మండప మార్పు, అన్నదాన భవన నిర్మాణం, నూతన ధ్వజస్తంభం ఏర్పాటు తదితర పనులను ఎమ్మెల్యేకి వివరించారు. ఆయన పలు సూచనలు చేశారు.

రికార్డుల తనిఖీ

మనుబోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జడ్పీ సీఈవో విద్యారమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధించి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశించే సర్వేలలో, అమలు చేసే పథకాలను ప్రజలకు అందించడంలో ముందుండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధుల మెరుగుకు కృషి : మెప్మా పీడీ

నెల్లూరు(హరనాథపురం,ఆంధ్రజ్యోతి): మహిళల జీవనోపాధుల మెరుగుకు కృషి చేస్తున్నామని మెప్మా పీడీ రాధమ్మ తెలిపారు. శుక్రవారం వెంకటేశ్వరపురం టిడ్కోల ఇళ్ల సముదాయంలో మహిళలతో ఆమె సమావేశం నిర్వహించారు. పొదుపు సంఘాలలో లేనివారితో సంఘాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. వారిలో పొదుపు చేసుకునే అలవాటును పెంచి మెరుగైన జీవనోపాధులు కల్పిస్తామని చెప్పారు. సీఎంఎం కవిత పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాన్ని నివారించండి : ఎస్ఈ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం, రూరల్ డివిజన్ల పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నివారించేందుకు ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరు నగరం, రూరల్ డివిజన్ల అధికారులతో విద్యుత్ భవన్ లో ఆయన శుక్రవారం సమీక్ష జరిపారు. డీఈఈలు ప్రతినెలా ఇండస్ట్రియల్, కేటగిరి -2 సర్వీసులకు రీడింగులు తీయాలని, ప్రతి సర్వీసును తనిఖీ చేయాలని సూచించారు. రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. వినియోగదారుల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, డీఈలు అశోక్, సునీల్, కిరణ్, భాను నాయక్, రాము తదితరులు పాల్గొన్నారు.

వేదగిరి, జొన్నవాడలో విజయేశ్వరీదేవి పూజలు

నెల్లూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలోని కరుణామయి ఆశ్రమ అధిపతి విజయేశ్వరీదేవి శుక్రవారం వేదగిరి, జొన్నవాడ క్షేత్రాలను దర్శించారు. అర్చక బృందాలు ఆమెకు సాదర స్వాగతం పలికాయి. అనంతరం ఆది లక్ష్మి, నరసింహస్వామికి, కామాక్షి తాయి, మల్లికార్జున స్వామికి పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆ తర్వాత భక్తులతో ఆమె అభిభాషించారు.

వివాదాస్పద భూమిని పరిశీలించిన జేసీ, ఆర్డీవో


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలోని వవ్వేరు గ్రామ రెవెన్యూ పరిధిలో 74/1, 74/2 సర్వే నెంబర్లలోని వివాదాస్పద భూమిని శుక్రవారం ఆర్డీవో నాగ సంతోషి అనూషతో కలిసి శుక్రవారం జేసీ కార్తీక్ పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దారు వెంకటేశ్వర్లు, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అనంతరం ఆర్డీవో బుచ్చిలోని రెండు సినిమా థియేటర్లను తనిఖీ చేశారు.

పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాల పంపిణీ

మనుబోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన గడ్డి విత్తనాలను పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి పంపిణీ చేశారు. మండలంలోని చెర్లోపల్లిలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. గేదెలు, ఆవులు, జీవాలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ గురవారెడ్డి, టీడీపీ నాయకుడు పొన్నూరు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కోర్టు డైరీ ఆవిష్కరణ

కోవూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాయవాద సంఘం కార్యాలయం ఎదుట శుక్రవారం న్యాయవాదులు వినియోగించే కోర్టు డైరీ, క్యాలెండర్‌ను ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యదర్శి బీ చెంచురెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాదులు జీ శ్యామచార్యులు, ఎం మల్లికార్జునరావు, పీ వెంకటేశ్వర్లు, సీ సురేంద్రరెడ్డి, కే ఉమామహేశ్వరరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్ల సమస్యలు పరిష్కారిస్తా : నుడా చైర్మన్ కోటంరెడ్డి


కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(జడ్పీ), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బిల్డర్ల సమస్యలు పరిష్కారిస్తామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో ఆయనను శుక్రవారం బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాణ రంగానికి సంబంధించిన పలు సమస్యలను కోటంరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నుడా పరిధిలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు చైర్మన్ వారికి వెల్లడించారు. కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు రామ్మూర్తిరెడ్డి, రామకృష్ణ, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మాదిగల సమస్యలు పరిష్కరించండి'

నెల్లూరు(హరనాథపురం), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ శుక్రవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు.

న్యూస్ బాక్స్

'కండలేరు' నీటి మట్టం

రాపూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.05 టీఎంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టు తిరుమలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సోమశిల వరద కాలువల ద్వారా ఇన్‌ఫ్లో 700 క్యూసెక్కులుగా ఉందని, వివిధ కాలువల ద్వారా అవుట్‌ఫ్లో 1225 క్యూసెక్కులు వెళ్తుందని ఆయన తెలిపారు.

నేడు మండల సమావేశం

మనుబోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జలజాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖల వారీగా సమీక్షలు చేయనున్నామని, అధికారులు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

ప్రభుత్వ వైద్యుల తీరు మారలేదు

కోవూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేసే వైద్యుల పనితీరులో మార్పు రాలేదని టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డి ఆరోపించారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్యం పేదవాడికి అందకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో కొంత మంది వైద్యులు బాగా పనిచేస్తున్నప్పటికీ కొందరు సక్రమంగా వైద్యశాలలకు రావడం లేదన్నారు. వైద్యశాలల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశానాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

వెంకటాచలం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం శ్మశానాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ జంగాలపల్లి శ్మశానాన్ని శుక్రవారం గ్రామస్థులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఏ ఒక్క శ్మశానానికి గ్రావెల్ తోలి అభివృద్ధి చేసిన దాఖాలు లేవన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల్లో గ్రావెల్‌ను కొల్లగొట్టి రూ.కోట్లాది రుపాయలు దోచుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, చల్లా చెంచయ్య, మణి, శ్రీను పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

మనుబోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్షిక పరీక్షలు మరో 50 రోజుల్లో రానున్న నేపథ్యంలో గంటపాటు అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను విద్యార్థులకు దాతల సాయంతో అల్పాహారం పంపిణీ చేసేలా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ చర్యలు తీసుకున్నారు. తొలి రోజున కాగితాలపూరుకు చెందిన సర్వేపల్లి నియోజకవర్గ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ చల్లగిరి చిట్టిబాబు అల్పాహారం కోసం రూ.5వేలు వితరణ చేశారు.

రైతులకు యూరియా పంపిణీ

వెంకటాచలం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుంటపాళెంలో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చవటపాళెం పీఏసీఎస్ అధ్యక్షుడు రావూరి రాధా కృష్ణమనాయుడు స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో హరికరుణాకర్ రెడ్డి, సొసైటీ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

నెల్లూరు(హరనాథపురం), : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ చెప్పారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో రాష్ట్రంలోని మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఉయ్యాల జగన్‌మోహన్, వెంకటరమణయ్య, జయప్రద, గోపాల్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు జాన్వీ కపూర్



ప్రముఖ సినీనటి జాన్వీ కపూర్ శుక్రవారం కాలినడకన తిరుమలకు వచ్చారు. అలిపిరి నుంచి స్నేహితులతో కలిసి సాయంత్రం బయలుదేరిన ఆమె రాత్రి తిరుమల చేరుకున్నారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. నడకమార్గంలో పలువురు సినీ అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రేపే ముగ్గుల పోటీలు

నెల్లూరు, కావలి, గూడూరులలో..

ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు రేపు జరగనున్నాయి. తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు నెల్లూరు, కావలి, గూడూరు కేంద్రాల్లో ఆదివారం నాడు జరుగుతాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో జరుగుతాయి. నెల్లూరు నగరంలో వీఆర్ కళాశాల మైదానం, కావలిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కారొనేషన్ రీడింగ్ రూం ఆవరణం, గూడూరు సనత్‌నగర్‌లోని శ్రీచైతన్య కళాశాల ఆవరణంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గురిలో ఒకరిని జిల్లా విజేతగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదీన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. నెల్లూరు నగరంలో జరిగే పోటీలకు సీఎంఆర్ చంద్రన బ్రదర్స్, గూడూరులో జరిగే పోటీలకు పాశం సంధ్యారాణి లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

శ్రీసిటీలో ఎయిర్ స్ట్రిప్



- అవకాశాలు పరిశీలించాలని ఏవియేషన్ అధికారులకు సీఎం సూచన

తిరుపతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో విస్తరించి ఉన్న శ్రీసిటీ సెజ్‌లో విమానాల రాకపోకలకు వీలు కల్పించేలా ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సివిల్ ఏవియేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, ఏపీ సివిల్ ఏవియేషన్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు కొత్తగా ఏర్పాటు చేయాల్సిన ఎయిర్‌పోర్టులు, ఎయిర్‌స్ట్రిప్‌ల గురించీ ఆలోచించాలని సూచించారు. అందులో భాగంగా శ్రీసిటీ పరిధిలో ఎయిర్‌స్ట్రిప్ గురించి ప్రస్తావించారు. పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, విదేశీ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు రాకపోకలు సాగించడానికి వీలుగా శ్రీసిటీలో ఎయిర్‌స్ట్రిప్ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆయన సివిల్ ఏవియేషన్ అధికారులకు సూచించారు.

ఆగస్టులోనే ప్రస్తావన

శ్రీసిటీ సెజ్ ఏర్పాటు చేసే సమయంలోనే ఎయిర్‌స్ట్రిప్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. సెజ్‌కోసం 10వేల ఎకరాల సేకరించాలని తొలుత ప్రతిపాదించగా 8వేల ఎకరాలు మాత్రమే ఇప్పటి వరకూ సేకరించారు. ఇంకా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి భూముల కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తొలినాటి ప్రతిపాదనలకు అనుగుణంగా మరో 2వేల ఎకరాల భూములు సేకరించి ఏపీఐసీసీ ద్వారా శ్రీసిటీకి అప్పగించాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడవ నెలలోనే గత ఏడాది ఆగస్టు 19న శ్రీసిటీలో పర్యటించారు. ఆ సందర్భంలో ఎయిర్‌స్ట్రిప్ అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. దానిపై సెజ్ యాజమాన్యం నుంచి పూర్తి వివరాలు తీసుకొని నివేదించాలని జిల్లా యాంత్రంగాన్ని సీఎం ఆదేశించారు. ఆతర్వాత ఎయిర్‌స్ట్రిప్ అవసరం, అవకాశాలు, ఇతర మౌళిక సదుపాయాల గురించిన వివరాలు కోరుతూ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఇటీవల శ్రీసిటీ యాజమాన్యానికి లేఖ రాశారు. వారి నుంచి స్పందన వచ్చిన తర్వాత ఎయిర్‌స్ట్రిప్‌పై మరింత స్పష్టత రానుంది.



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, కారుతో ఫారెస్ట్ అధికారులు

మళ్లీ కొండెక్కుతున్న 'పుష్ప'లు

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లపాటు తిరుమలకు దూరంగా ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లు తిరిగి కొండపై కన్నేశారు. ఎంతో కట్టుదిట్టమైన భద్రతా ఉన్నా తిరిగి తిరుమలకు సమీపంలో శేషాచల అడవుల్లో ఎర్రచందనం దోచుకోవడం మొదలుపెట్టారు. తిరుమల శేషచల అడవుల్లో విలువైన ఎర్రచందనం సంపద ఉన్న విషయం తెలిసిందే. ఐదారేళ్ల కిందటి వరకు తిరుమలకు సమీపంలో పార్వేటమండపం, పాపవినాశనం, శ్రీవారిపాదాలు, శ్రీవారిమెట్టు, శిలాతోరణం, కుమారధార, పసుపుధార వంటి ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణా యథేచ్ఛగా జరిగేది. వందల టన్నుల కొద్దీ ఎర్రచందనం దుంగలను వాహనాల ద్వారా తిరుమల ఘాట్ నుంచే తరలించేవారు. నిఘాను పటిష్ఠం చేయడంతో తిరుమల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణాకు చెక్‌పడింది. కొన్నేళ్లపాటు స్మగ్లర్లు తిరుమల కొండను వదిలిపెట్టి మిగిలిన ప్రాంతాలపై పడ్డారు. తాజాగా మళ్లీ తిరుమల కొండెక్కడం మొదలుపెట్టారు. భక్తుల ముసుగులో ఇతర రాష్ట్రాల వాహనాలతో తిరుమలకు చేరుకుని సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను కూలదోస్తున్నారు. దుంగలను వాహనాల్లో ఎక్కించి నెమ్మదిగా తిరుమల నుంచి జారుకుంటున్నారు. ముందస్తు సమాచారంతో ఫారెస్ట్ విభాగం అధికారులు ఇటీవల తిరుమల పరిసర ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెట్టడంతో డిసెంబరు 19వ తేదీన కుమారధార, పసుపుధార ప్రాంతంలో దాదాపు 150 కేజీల బరువున్న ఐదు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని సేలంకు చెందిన సతీష్, వెంకటేషన్, త్యాగరాజన్‌ను అరెస్ట్ చేశారు. తాజాగా, గురువారం సాయంత్రం ముందస్తు సమాచారంతో శిలాతోరణం చెక్‌పోస్ట్ వద్ద కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఓ కారును అడ్డుకున్నారు. కారు నుంచి దిగి పారిపోయే ప్రయత్నం చేసిన తమిళనాడు విల్లుపురంకు చెందిన రమేష్ గోవిందరాజ్ అనే డ్రైవర్‌ను చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. కారుతో పాటు కారులోని దాదాపు 536 కేజీల బరువు కలిగిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అతడి వద్ద లభించిన సెల్‌ఫోన్‌లోని నెంబర్ల ద్వారా మిగిలిన స్మగ్లర్ల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. రమేష్ ఇచ్చిన నెంబర్లన్నీ స్విచ్‌ఆఫ్‌లో ఉండటంతో తమదైన శైలిలో విచారిస్తున్నారు. ఇలా కొన్నేళ్లుగా తిరుమలకు దూరంగా ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లు తిరిగి స్వామి క్షేత్రానికి వచ్చే సాహసం చేస్తున్నారు. అయితే శేషాచల అడవుల నుంచి ఎర్రచందనం తరలించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, ఇప్పటికే అన్ని ప్రాంతాలను జల్లెడపడుతున్నామని ఫారెస్ట్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

శేషాచలంలో బీటెక్ విద్యార్థుల అదృశ్యం

- ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులతో కలసి పోలీసుల గాలింపు
- మిత్రులకు లొకేషన్ షేర్ చేసిన ఓ విద్యార్థి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శేషాచల అడవుల్లో బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారని సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు ఇక్కడి వాగేటికోన ప్రాంతంలో.. గుంజన జలపాతాలను చూడడానికి శుక్రవారం విహారయాత్రగా వచ్చారు. తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు తెలిసింది. రాత్రి కావడంతో ఆందోళన చెందిన వీరు.. ఫోన్ సిగ్నల్స్ రావడంతో మిత్రులకు సమాచారం అందించారు. మిత్రుల సలహా మేరకు లైవ్ సిగ్నల్స్ లొకేషన్ పంపించారు. వీరంతా అడవిలో తిరుగుతూ చివరకు రైల్వేకోడూరు అటవీ పరిధిలోని ఎస్.ఉప్పరపల్లి, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే ఫోన్ సిగ్నల్స్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రేణిగుంట పోలీసులు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్ రావు ఆదేశాల మేరకు కోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు తమ సిబ్బందితో అటవీశాఖ అధికారులతో కలిసి అడవిలో జల్లెడ పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే వారి ఆచూకీ త్వరగా లభిస్తుంది. తప్పిపోయిన విద్యార్థుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.



శేషాచలం అడవి నుంచి లైవ్ లొకేషన్ పంపిన విద్యార్థి

ఇంటర్ విద్యార్థులకు

నేటినుంచి మధ్యాహ్న భోజనం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు
- జిల్లాలో 5,759 మందికి ప్రయోజనం



చంద్రగిరి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పళ్లేలు, గ్లాసులు అందజేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి తదితరులు

తిరుపతి(విద్య), జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఒక్కో హామీని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేయనుంది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో జిల్లాలో 5,759 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు చాలా ఏళ్లనుంచి మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉంది. అయితే జూనియర్ కళాశాలల్లోనూ పేద, సామాన్య విద్యార్థులు ఎక్కువగా ఉండటం.. సుదూర గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో ఉదయాన్నే భోజనం తెచ్చుకోవడానికి ఇబ్బంది పడేవారు. దీనిని గమనించిన గతంలోని టీడీపీ ప్రభుత్వం 2014- 2019 మధ్య కాలంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని నిలిపేసింది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడటంతో పాటు కొంత హాజరుశాతంకూడా తగ్గింది. ఇంటర్ విద్యార్థుల ఇబ్బందులను, వారి తల్లిదండ్రుల అభ్యర్థనను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తాము అధికారంలోకి వస్తే ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తామని నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఆ మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో శనివారం నుంచి ప్రారంభిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన పళ్లాలు, గ్లాసులను ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేసింది. వంట బాధ్యతలను కళాశాలలకు సమీపంలోని ఉన్నత పాఠశాల భోజన పథకం నిర్వాహకులు లేదా స్వయం సహాయక బృందాలకు అప్పగించారు.

విద్యార్థులకు ఎంతో మేలు



కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని పునరుద్ధరించి ఇంటర్ విద్యార్థులకు ఎంతో మేలు చేసింది. ఈ పథకం అమలువల్ల డ్రాపౌట్స్ తగ్గుతారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడుతుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే వారి సంఖ్యా పెరుగుతుంది.

- ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌ఐవో, తిరుపతి జిల్లా

మెనూ ఇదీ

సోమవారం:	అన్నం, కూరగాయల కూర, ఉడికించిన గుడ్డు, చిక్కీ
మంగళవారం:	పులగం లేదా పులిహోర, పల్లీచట్నీ, కోడిగుడ్డు ఫ్రై, రాగిజావ
బుధవారం:	అన్నం, సాంబారు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం:	కూరగాయల అన్నం (వెజిటబుల్ రైస్), గుడ్డుకూర, రాగిజావ
శుక్రవారం:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం:	అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగలి, రాగిజావ

వైవిధ్య ఆలోచనలు..

వినూత్న ఆవిష్కరణలు

- శ్రీకాళహస్తిలో జిల్లా సైన్స్ ఫేర్

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొత్త కొత్త ఆలోచనలతో.. వినూత్న ఆవిష్కరణలకు విద్యార్థులు తెరతీశారు. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా సైన్స్‌ఫేర్‌లో తమ వైజ్ఞానిక ప్రదర్శనలను ఉంచారు. ఇందులో కొన్ని ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థి, వ్యక్తిగత, సామూహిక, ఉపాధ్యాయ విభాగాల్లో జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు కలెక్టరు వెంకటేశ్వర్ జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ నమూనాల్లో కొన్ని..

అంధుల దిక్సూచి



అంధుల కోసం స్మార్ట్ బ్లైండ్ వాకింగ్ స్టిక్‌ను వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మేఘనాథ్ పర్యవేక్షణలో రితీష్, వరుణ్‌రెడ్డి ఆవిష్కరించారు. 9 ఓల్ట్ బ్యాటరీతో అల్ట్రా వయలెంట్ సిగ్నల్ సెన్సర్‌తో ఈ వాకింగ్ స్టిక్ ఆటోమేటిక్‌గా సూచనలు చేసి ప్రమాదాల నుంచి తప్పిస్తుంది. ఇది గ్రూపు విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

దివ్యాంగులకు ప్రత్యేక వాహనం



లిఫ్ట్ తరహాలో దివ్యాంగులు సులభంగా బస్సు ఎక్కడం.. కావాల్సిన చోట దిగబెట్టడం వంటి ఆవిష్కరణను శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజీ ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు ప్రదర్శించారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానం సాధించారు.

వర్షపునీటితోనే తోట సాగు



భవనంపై కురిసే వాన చినుకులను పైపులు, సెన్సర్ల ద్వారా ఇంటి ఆవరణలోని పూలు, పండ్ల మొక్కలను సాగు చేసే విధానాన్ని ఆవిష్కరించారు రాజశేఖర్. పాకాల మండం ఓబులశెట్టివారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇతడు ఉపాధ్యాయుడు వెంకటరమణ పర్యవేక్షణలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రయోగాన్ని ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచాడు.

మద్యం తాగితే వాహనం కదలదంతే

డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదాలను అరికట్టేందుకు శ్రీకాళహస్తిలోని బాబుఅగ్రహారం పాఠశాలకు చెందిన చరణ్ 'ఆటోమేటిక్ ఇంజన్ లాకింగ్ సిస్టమ్' ప్రయోగాన్ని రూపొందించారు. డ్రైవర్ మద్యం తాగి వాహనాన్ని నడిపే ప్రయత్నం చేస్తే సెన్సర్ ఆల్కాహాల్ వాసనను పసిగట్టి ఆటోమేటిక్‌గా వాహనం ఆగిపోయేలా తయారు చేశారు. ఉపాధ్యాయురాలులు వరలక్ష్మి పర్యవేక్షణలో చరణ్ చేపట్టిన ఈ ప్రయోగం విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది.



ఎక్స్‌కవేటర్ మోడల్ నమూనా



సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గజేంద్ర సలహాతో తక్కువ ఖర్చుతో పాస్కల్ సూత్రం ఆధారంగా జేసీబీ నమూనా యంత్రాన్ని గణేష్, జశ్వంత్‌కుమార్‌రావు ఆవిష్కరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పని చేయొచ్చు. ఈ ప్రయోగం ద్వితీయ స్థానంలో ఎంపికైంది.

మలుపుల వద్ద ప్రమాదాలకు చెక్



రోలింగ్ బ్యారియర్స్ అనే సిద్ధాంతంతో.. మలుపులకు చెక్ పెట్టేలా వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన టీచరు సుబ్బరామయ్య కొత్త ప్రయోగాన్ని ముందుకు తెచ్చారు. మలుపుల వద్ద వాహనాలు ఢీకొన్న వెంటనే రబ్బర్‌బాల్స్ వంటి వాటిని తాకడం వల్ల అవి తిరగడంతో శక్తి వికేంద్రీకరణ జరిగి వాహనాలు దెబ్బ తినకుండా కట్టడి చేస్తుంది. దాంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడవచ్చు. ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగంలో ఈ ప్రదర్శన ద్వితీయ స్థానం సాధించింది.



మొదటిఘాట్‌లో సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ విభాగం సిబ్బంది

తిరుమల కనుమ దారుల్లో కొత్త సోలార్ దీపాలు

- మొదలైన పనులు -

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్లలో సోలార్ లైట్ల అమరిక పనులు మొదలయ్యాయి. 20 ఏళ్ల క్రితం ఈరోడ్లలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు పాడైపోయాయి. గత పాలకులు వీటి నిర్వహణను పట్టించుకోలేదు. ఇందువల్ల రాత్రిపూట వాహనదారులూ, రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే మొదటి ఘాట్‌రోడ్లులో 70, రెండవ ఘాట్‌రోడ్డులో పది ప్రాంతాల్లో నూతన సోలార్ ప్యాడ్లు, లైట్లను ఏర్పాటు చేసే పనులు గురువారం మొదలయ్యాయి. ప్రస్తుతం మొదటిఘాట్‌రోడ్డులో పనులు జరుగుతున్నాయి. వీటి ఏర్పాటుకు దాదాపు రూ.15 లక్షల మేరకు ఖర్చు కానుంది. ఇక, తిరుమల ప్రధాన రహదారుల్లోనూ పాత లైట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. శుక్రవారం జీఎన్సీ ఆర్చ్ నుంచి బాలాజీ బస్టాండ్ వరకు ఉన్న రహదారిపై 50 నూతన లైట్లను ఏర్పాటు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సినీనటి రాశి సింగ్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



నేరళ్ల శారద



రాశి సింగ్

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.17 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,085

తలనీలాలు సమర్పించినవారు: 15,680

పట్టుదల+కృషి = ఉద్యోగం

- అకడమిక్ జ్ఞానమొక్కటే సరికాదు
- అవసరమైన స్కిల్స్‌పై పట్టు సాధించాలి

● తిరుపతి ఉపాధ్యాయనగర్‌కు చెందిన ఆదర్శ్ ఇంజినీరింగ్ చదివాడు. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కష్టపడి చదివాడు. మంచి మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం రాలేదు. కాలేజి నుంచి బయటపడ్డాక ఆఫ్ కేంపస్ ఉద్యోగాల కోసం చేయని ప్రయత్నం లేదు. ఇప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు..

● పద్మావతినగర్‌కు చెందిన గాయత్రి పీజీ పూర్తిచేసింది. మంచి మార్కులే సాధించింది. ఆకాంక్షలకు తగిన ఉద్యోగమే చేయాలనేది ఆమె ఆకాంక్ష. చిన్నపాటి ఉద్యోగాలు వచ్చినా జాయిన్ కాలేదు. బ్యాంకు, ఆర్‌ఆర్‌బీ ఇలా ఏ నోటిఫికేషన్ కనిపించినా దరఖాస్తు చేస్తోంది. కొన్నింటికి ఎక్కువమంది హాజరవుతారని నిరాశతో పరీక్షే రాయలేదు. మూగేళ్లయినా ఉద్యోగం పొందలేకపోతోంది.





ఉద్యోగ సాధనకు అకడమిక్ నాలెడ్జ్ ఒక్కటే సరిపోదంటున్నారు తిరుపతిలోని కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్. ప్లేస్‌మెంట్ శిక్షణా సంస్థ నిర్వహిస్తున్న ఈయన యువత ఉద్యోగ సాధనకు అవసరమైన కొన్ని సూచనలిస్తున్నారు. ప్రత్యేక నైపుణ్యాలను పెంచుకుని, పట్టుదలతో సాధన చేస్తే ఉద్యోగ కల సాకారమవుతుందంటున్నారు. జాబ్ పొందడానికి ఆయన చెబుతున్న మార్గాలివి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



శ్రీధర్, కౌటిల్య శిక్షణా సంస్థ డైరెక్టర్

రెండు రకాల ప్లేస్‌మెంట్లు ఉంటాయి. బీటెక్, మరేదైనా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకోసం సన్నద్ధమవుతుంటారు. అయినా చాలా మంది విఫలమవుతుంటారు. బీటెక్ లేదా డిగ్రీ రెండో సంవత్సరం నుంచే జాబ్ ప్రిపరేషన్ అవసరం. కంపెనీలు కోరుకుంటున్న నైపుణ్యాలను అలవర్చుకోవాలి. ప్రత్యేకించి ఏదైనా సంస్థలో ఉద్యోగం కావాలనుకుంటే ముందుగా ఆ కంపెనీకి కావాల్సిన అర్హతలు, నైపుణ్యాలను తెలుసుకోవాలి. వాటికి తగ్గట్టుగా సాంకేతిక నైపుణ్యాలు (కోడింగ్)పై దృష్టి పెట్టాలి.

అకడమిక్ చదువులతో పాటు పరిశ్రమల నైపుణ్యాలకు సంబంధించి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఒక్కోసారి ఉద్యోగం సాధించడంలో విఫలం కావొచ్చు. అంతమాత్రాన నిరాశపడిపోకూడదు. తాము ఎందుకు విఫలమయ్యామో స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. కారణాన్ని ఖచ్చితంగా అంచనావేసి ఆయా అంశాలను సరిచేసుకుని మళ్లీ ప్రయత్నిస్తే ఖచ్చితంగా విజయాన్ని సాధించొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ ఎక్కువగా ఉంటుంది.... పోస్టులు తక్కువగా ఉంటాయి. అందుకు చాలామంది మొదట్లోనే నిరాశ పడతారు. పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపించరు. దరఖాస్తుదారులంతా పోటీ ఇవ్వరని గుర్తించరు. దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది డమ్మీ అభ్యర్థులే ఉంటారు. అందువల్ల సంఖ్యను చూసి ఆందోళన చెందక్కరలేదు. పోటీ పరీక్షకు తగినట్టు సన్నద్ధమయితే చాలు. విశ్లేషణాత్మక అధ్యయనం, అభ్యాసంతో కూడిన సాధన అవసరం. అకడమిక్ కోసం చదివినట్టు చదివితే ఉద్యోగం రాదు. పోటీ పరీక్షకు తగినట్టుగా అవసరమైన అంశాలపై ఫోకస్ పెట్టాలి.

బ్యాంకు పరీక్షలకు ప్రిపేరయితే తక్కువ సమయంలోనే ఉద్యోగం సాధిచవచ్చు. బ్యాంకు పరీక్షల సిలబస్‌తో ఏటా సుమారు 20 పోటీ పరీక్షలు జరుగుతాయి. ఒకే శిక్షణతో, ఒకే సన్నద్ధతతో 20 పరీక్షలకు పోటీ పడొచ్చు. అందువల్ల ఏదో ఉద్యోగం రాక పోదు.

పోటీ పరీక్షల ప్రిపరేషన్ మొదలు పెట్టాక ఉద్యోగం సాధించడానికి 1 నుండి మూడేళ్లు పట్టవచ్చు. కొంత మందికి ఇంకా ఎక్కువ సమయం పట్టవచ్చు. దీర్ఘకాల పోటీలో చాలామంది వైదొలుగుతారు. కేవలం సీరియస్ అభ్యర్థులు మాత్రమే నిలబడతారు. దీర్ఘకాలం సమయం,పట్టదలతో కూడిన ప్రిపరేషన్ ఉంటే సర్కారీ కొలువు సాధ్యమే.

ఉద్యోగ సాధన ప్రయాణంలో మొదటగా ఏ చిన్న ఉద్యోగం వచ్చినా వదులుకోకూడదు. ఆ ఉద్యోగం చేస్తూనే దీర్ఘకాల లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నించాలి. చిన్న ఉద్యోగమైనా ఆర్థికంగా ఆసరాగా ఉంటుందని గ్రహించాలి. అది ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్నిఇస్తుంది. పెద్ద ఉద్యోగం పొందేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.



ముక్కంటిని దర్శించుకున్న విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి, జనరవి 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం 70మంది అమెరికా భక్తులు దర్శించుకున్నారు. పెంచలకోన కరుణామయి ఆశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి విజయేశ్వరి దేవితో కలిసి వారు వచ్చారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అమెరికా భక్తుల శివనామస్మరణతో ఆలయం మారోమోగింది.

వైకుంఠ ఏకాదశికి తిరుమలలో

మైసూర్ నిపుణులచే విద్యుత్ అలంకరణలు

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈఏడాది వైకుంఠ ఏకాదశికి విద్యుత్ అలంకరణ విశేషంగా చేయాలని నిర్ణయించారు. మైసూర్ దసరా ఉత్సావాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో కూడా అలంకరణ చేస్తారు. అలాగే ప్రత్యేకమైన పౌరాణిక పాత్రలతో కూడిన పూల అలంకరణలూ చేయనున్నారు. ఈ వివరాలను శుక్రవారం అన్నమయ్య భవనంలో జరిగిన వైకుంఠ ఏకాదశి సమీక్షా సమావేశంలో అధికారులు వెల్లడించారు. టీటీడీ ఈవో శ్యామలరావు ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఐటీ విభాగం జీఎం శేషారెడ్డి, అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి భక్తులకు సులభతరంగా వైకుంఠద్వార దర్శనం కల్పించేందుకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. భక్తులకు వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ కేటాయించడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. వైకుంఠ ఏకాదశి ముఖ్యాంశాలతో అధికారులు సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్‌ను రూపొందించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు.

నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా

- ఉద్యోగాలకు 689 మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



జాబ్‌మేళాకు హాజరైన యువత

చంద్రగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్వగ్రామం.. చంద్రగిరి మండలం నారావారిపల్లెలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేళాకు నియోజకవర్గంలోని 1832 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శ్రీసిటీ, నాయుడుపేట, రేణిగుంట, గాజులమండ్యం ఎస్‌ఈజెడ్‌లు, అనంతపురంలోని కియా మోటార్స్.. ఇలా 21 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 689 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరందరికీ సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం రానివారు నిరుత్సాహ పడకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో కంపెనీల ఏర్పాటుకు స్థలాలు అనువుగా ఉన్నాయని, వీటి ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. చంద్రగిరికి త్వరలో అనేక ప్రాజెక్టులు రానున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనకు వచ్చిన పుడల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించేవారని గుర్తుచేశారు. నారా లోకేశ్ యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. ఆరు నెలలకు ఒకసారి మేళా న్విహిసన్తామన్నారు. త్వరలో చంద్రగిరికి ఐటీ కంపెనీలు వస్తాయన్నారు. ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా ఆత్మస్థైర్యంతో పని చేసి, తల్లిదండ్రుల కష్టాలలో పాలుపంచుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బొబ్బా లక్ష్మి, ఉపసర్పంచి రాకేష్‌చౌదరి, పులివర్తి సుధారెడ్డి, డీపీవో, స్పెషల్ ఆఫీసర్ సుశీలదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, తహసీల్దారు శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం

రూ.1.76 కోట్లు




హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.1,76,75,333 వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73 గ్రాములు, వెండి 478.550కిలోలు, విదేశీ కరెన్సీ 186 వచ్చింది. ఈవో బాపిరెడ్డి ఈ హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు- అత్తిపట్టు

రైల్వే రూట్ మ్యాప్ సిద్ధం

ఏపీ, తమిళనాడులో నాలుగేసి స్టేషన్లు



పుత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు- అత్తిపట్టు మధ్య రైల్వే లైను రూట్ మ్యాప్ ప్రాజెక్టు సిద్ధమైంది. 88.30 కిలోమీటర్లు.. సింగిల్ విద్యుత్ లైను మార్గంలో ఎనిమిది స్టేషన్లను ప్రతిపాదించారు. జిల్లాలో నారాయణవనం, కృష్ణమరాజుకండ్రిగ, పిచ్చాటూరు, నాగలాపురం.. తమిళనాడులో ఊత్తుకోట, పాలవ్కాకం, పెరియపాలెం, గంగయాదికుప్పంలో స్టేషన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పుత్తూరు రైల్వే స్టేషన్ నుంచి నారాయణవనం మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. మిగిలిన స్టేషన్లు పది కిలోమీటర్ల వంతున ఉన్నాయి. పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనను దృష్టిలో ఉంచుకుని కృష్ణమరాజుకండ్రిగను కూడా స్టేషన్‌గా ప్రతిపాదించారు. ఇక, పుత్తూరు నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో అంటే నారాయణవనం రైల్వే గేటు- మరాఠీ రైల్వే గేట్ల మధ్య ఈ కొత్త రైల్వే లైను తిరుగుతుందని పేర్కొన్నారు. ఈ రైల్వే మార్గంలో 15 మేజర్.. 159 మైనర్ వంతెనలు ఉంటాయని ప్రతిపాదించారు. ప్రతిరోజు ప్రయాణికుల కోసం ఆరు బోగీలు వుండే నాలుగు ఈఎంయులు నాలుగు ట్రిప్పులు తిరగనున్నాయి. ఈ విద్యుత్ రైళ్ల ఇటు పుత్తూరు- చెన్నై, అటు సూళ్లూరుపేట-చెన్నై లైన్లలో కలుస్తాయి. దీంతో శ్రీసిటీ వెళ్లే ఉద్యోగులు, చెన్నై, పుత్తూరు వెళ్లే వ్యాపారులకు అనుకూలంగా ఉంటుంది.

ప్రాజెక్టు ఉద్దేశం

ఈ విద్యుత్‌లైన్ వల్ల ప్రధానంగా బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుపఖనిజం, దిగుమతయ్యే బొగ్గు రవాణాకు ఉపయోగమౌతుందని ప్రతిపాదించారు. చెన్నై ఓడరేవు మీద పెరిగిన ఒత్తిడిని తగ్గించేందుకు అట్టిపట్టు సమీపంలోని ఎన్నూరు ఓడరేవును ఎంచుకుని ఈ రైలు మార్గంను ప్రతిపాదించారు.

తిరువళ్లూరు- పెరియపాలెం రెండో విద్యుత్ లైన్

పుత్తూరు-అట్టిపట్టు లైను ప్రాజెక్టు ప్రతిపాదనలోనే తిరువళ్లూరు-పెరియపాలెం మధ్య 28.30 కిలోమీటర్ల మరో చిన్న లైనును అధికారులు ప్రతిపాదించారు. పూర్తిగా తమిళనాడులోనే వెళ్లే ఈ మార్గంలో కలింబాకం, మేల్‌కొండయార్, వెంగల్ వంటి మూడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ రూట్‌లోనూ ప్రయాణికుల కోసం నాలుగు ట్రిప్పులు విద్యుత్ రైళ్లు తిరుగుతాయి.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి

- అఖిలపక్ష నేతల డిమాండ్ ● 5న రౌండ్‌టేబుల్ సమావేశం

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ఈనెల 5వ తేదీన స్థానిక షాదీమంజిల్‌లో అఖిలపక్షాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపిందని చెప్పారు. దీంతో నియోజకవర్గ ప్రజలు జిల్లా కేంద్రమైన తిరుపతికి వెళ్లాలంటే దూరం కావడంతో వ్యయప్రయాసాలు పడాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు అఖిలపక్షపార్టీలు సమావేశం నిర్వహించి సాధించుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, కాంగ్రెస్ నాయకులు పంటా శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్, వేమయ్య, సీపీఐ నాయకులు కాలేషా, శశికుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

నిమ్మ పరిశోధన కేంద్రంలో యూకే పారిశ్రామికవేత్త

వెంకటగిరిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కింగ్‌డం(యూకే)కి చెందిన పారిశ్రామికవేత్త హగో బొవిల్ వెంకటగిరి సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని నిమ్మ, చీని పరిశోధన కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఆయనతో పాటు గూడూరులోని సీఫల్ హెర్బల్ సంస్థ ఎండీ యలవర్తి విద్యాసాగర్, ఇండో వరల్డ్ ట్రేడింగ్ కార్పొరేషన్(న్యూఢిల్లీ) ఉపాధ్యక్షుడు అనిల్ కాత్యాల్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా నిమ్మ, చీని పరిశోధన శాస్త్రవేత్త శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ యూకే నుంచి భారత పర్యటనకు వచ్చిన హగో బొవిల్ న్యూఢిల్లీ నుంచి పెట్లూరు నిమ్మపరిశోధన కేంద్రానికి వచ్చారని తెలిపారు. పెట్లూరు నిమ్మకు భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, దాని నుంచి సుగంధ ద్రవ్యాల తయారీపై ఆరాతీశారని చెప్పారు. పెట్లూరు నిమ్మ ప్రాసెసింగ్, మార్కెటింగ్, రైతుల ఆసక్తి, నిమ్మ రకాలు తదితర అంశాలపై హగో బొవిల్‌కు విశదీకరించారు. నిమ్మపంట ఉత్పత్తి, దిగుబడిపై వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఖాందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



పెట్లూరు నిమ్మ గురించి వివరాలు తెలుసుకుంటున్న హగో బొవిల్

గిరిజన మహిళలకు వైసీపీ ఎంపీపీ టోకరా

- గ్రూపు రుణాలు తీసుకుని పరార్



పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ సామాజికవర్గానికి చెందిన గిరిజన మహిళల రుణాలు తీసుకుని ఓ ఎంపీపీ మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీఎన్‌కండ్రిగ పంచాయతీ లక్ష్మీపురం గిరిజన కాలనీకి చెందిన బాధిత గిరిజన మహిళలు స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టి ఎస్‌ఐ విశ్వనాథ నాయుడికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. తమ కాలనీలో కాపురం ఉంటున్న సుమారు 50 మందికి పైగా మహిళలు గత పది సంవత్సరాలుగా గ్రూపులు ఏర్పాటు చేసుకుని వివిధ ప్రైవేటు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించేవారమన్నారు. కాలనీలో ఉన్న ఐదు గ్రూపుల్లో ఉన్న మహిళలతో పాటు ఎంపీపీ సుబ్బలక్ష్మి ప్రతి గ్రూపులో సభ్యురాలిగా చేరి ఐదు బ్యాంకుల్లో ఆరు నెలల క్రితం ఒక్కో బ్యాంకు నుంచి రూ.60వేల చొప్పున రుణం పొందిందన్నారు. ఈ రుణానికి ప్రతి నెల రూ.3600 చొప్పున ఐదు బ్యాంకులకు కలిపి రూ.18వేలు సుబ్బలక్ష్మి గ్రూపు సభ్యులతో పాటు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ రుణం తీసుకున్న నాటి నుంచి బ్యాంకులకు ఒక్క నెల కంతు కూడా చెల్లించలేదన్నారు. ఎంపీపీతో తమకు పనిలేదని గ్రూపు సభ్యులందరు రుణం చెల్లించాలని బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీంతో రుణం చెల్లించాలని తాము అడిగితే సుబ్బలక్ష్మి తన భర్తతో ఇల్లు వదిలి వెళ్లిపోయిందన్నారు. మూడు నెలలు నుంచి ఎంపీపీ తీసుకున్న రుణం కూడా తామే చెల్లిస్తున్నట్టు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



తెలుగంగ కాలువ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఊట్లపల్లి సమీపంలోఉన్న తెలుగంగ కాలువ వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఏపీఐఐసీ, తెలుగంగ, ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మేనకూరు సెజ్ కోసం ఏపీఐఐసీ వారు నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా మావూరమ్మ చెరువు, చిలమనూరు చెరువులకు నీటిని తరలించనున్నట్లు చెప్పారు. దీంతో చిలమనూరు, ఊట్లపల్లి, గొల్లగుంట తదితర గ్రామాల్లోని మెట్ట భూములు సాగులోకి వస్తాయన్నారు. తెలుగంగ ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, మైనర్ ఇరిగేషన్ ఈఈ బాబురెడ్డి, టీడీపీ నేతలు దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, వేళ్ల సురేంద్రరెడ్డి, దాసరి కోటేశ్వరావు, చీళ్ల మధు, పులకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలసిన బీజేపీ నాయకులు



మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న విజయభాస్కర్, మధురెడ్డి, చెంచుకృష్ణయ్య

నాయుడుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శుక్రవారం అమరావతిలో బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి చెంచుకృష్ణయ్య, అత్తలపాళెం మధురెడ్డి మర్యాదపూర్వకంగా కలసి శాలువాలతో సన్మానించినట్లు తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పలు సమస్యలపై మాట్లాడినట్లు తెలిపారు. నాయుడుపేటలో ట్రామాకేర్ సెంటర్ భవనం పూర్తిఅయినప్పటికీ అందులో కావాల్సిన వైద్య సిబ్బంది, పరికరాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న మణెమ్మ



నాయుడుపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయిపూలే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును నాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న మణెమ్మ అందుకున్నారు. సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా తిరుపతి ఎస్వీయూలో నిర్వహించిన సభలో అవార్డును మణెమ్మ అందుకున్నారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యాయులు సురేష్, సుబ్బారావు, వసంతకుమారి అభినందనలు తెలిపారు.

తుంపర్లసేద్యం పరికరాల పంపిణీ

చిల్లకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలులో శుక్రవారం స్థానిక రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తుంపర్లసేద్యం పరికరాలను అందజేశారు. తహసీల్దారు మాట్లాడుతూ సూక్ష్మనీటి పారుదల వ్యవస్థ ద్వారా 13 మంది రైతులకు 90శాతం రాయితీతో పరికరాలను అందజేసినట్లు చెప్పారు. దువ్వూరు కృష్ణారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, సరిత, చంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, శేఖర్, లక్ష్మీనరసింహం, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆయా మున్సిపల్ కార్యాలయాల వద్ద ఈనెల 10వ తేదీ నుంచి దీక్షా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రాజేష్, పెంచలప్రసాద్, వెంకటరమణయ్య, సంపూర్ణమ్మ, శివకుమార్, శ్రీనివాసులు, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని, వారికి హెల్త్ అలవెన్స్ నగదు అందజేయాలని మున్సిపల్ కార్మికుల సంఘ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కార్మికులతో కలసి కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేశారు. న్యాయవాది హరిబాబు, హరికృష్ణ, మధు, మణి, నవీన్, శ్యామలమ్మ, పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోసం లెర్నిట్ సంస్థతో ఒప్పందం

గూడూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో నైపుణ్యాలను పెంపొందించేందుకు లెర్నిట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో సంస్థతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాన్ని చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎంప్లాయిబిలిటీ ఎన్హాన్సుమెంట్ ట్రైనింగ్ (జీఈఈటీ) ద్వారా కళాశాలలో డిగ్రీ పూర్తిచేసుకున్న విద్యార్థులకు 15 రోజులపాటు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. బ్యాంకింగ్ సెక్టార్, కంప్యూటర్ తదితర రంగాల్లో ఉపాధి పొందేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులుగా రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్రీడాకారులుగా రాణించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీక్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. క్రీడలను ప్రోత్సహించిన అల్లూరు ఆదిశేషారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విన్నర్‌గా నిలిచిన శ్రీచైతన్య పాఠశాల, రన్నర్‌గా నిలిచిన ఎల్‌ఏపీ పాఠశాల జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మునిగిరీష్, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, లవకుమార్, జీజీ నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

తడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులు ఎక్కువకావడంతో ఓ గర్భిణికి 108లో ప్రసవం జరిగింది. మండల పరిధిలోని గ్రద్దగుంట దళితవాడకు చెందిన కుప్పంపాటి నవీన్ భార్య రేఖకు శుక్రవారం తెల్లవారుజామున పురిటినొప్పులు వచ్చాయి. దీంతో 108కు సమాచారం అందించారు. వాహన సిబ్బంది కోటేశ్వరరావు, పెంచలయ్యలు ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు ఎక్కువై ప్రసవవేదన పడింది. దీంతో 108 సిబ్బంది వాహనంలోనే ఆమెకు పురుడుపోశారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చర్చివీధికి చెందిన సుకుమార్ అనే బాధితుడికి రూ.59వేలు సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న వారికి ఆర్థిక సహకారాన్ని అందించేలా సీఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట-మల్లాం జంక్షన్ కూడలి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆ యువకుడి తల నలిగిపోయింది. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలిస్తున్నారు.

భువనేశ్వర ఆలయంలో హుండీ చోరీ

తడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయ హుండీలో నగదు చోరీకి గురైంది. గురువారం సాయంత్రం సమయంలో పూజారి చంద్రమౌళి ఆలయానికి తాళాలువేసి ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఆలయానికి రాగా హుండీని పగులగొట్టి ఉండటాన్ని చూసి చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకున్నాడు. సుమారు రూ.8వేల వరకు భక్తులు సమర్పించిన నగదు ఉండవచ్చని పూజారి తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

అసభ్య ప్రవర్తనపై విచారణ

చిల్లకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడతావారిపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించారని అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ విచారణ నిర్వహించారు. డిప్యూటీ ఈవో మాట్లాడుతూ విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని తన దృష్టికి రావడంతో పాఠశాలలో విచారణ నిర్వహించామన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

మార్ట్‌లు.. డాబాలపై కేసు నమోదు

కోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోటలోని పలు మార్ట్‌లు, డాబాలపై కేసులు నమోదైనట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తెలిపారు. కోటలోని ఓ మార్ట్, విద్యానగర్‌లోని రెండు డాబాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటేశ్వరరావు, నర్మదలు గురువారం దాడులు జరిపి శాంపిల్స్ తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. విద్యానగర్‌లోని రెండు డాబాలు, ఒక మెస్, ఒక బేకరికి నోటీసులిచ్చినట్లు తెలిపారు. కోటలోని ఒక మార్ట్‌పై కేసు నమోదుచేసినట్లు అధికారులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధిలో విద్యాకమిటీలే కీలకం

డక్కిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యాకమిటీలు కీలకంగా వ్యవహరించాలని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యాకమిటీలు, ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు ముగిశాయి. అనంతరం అక్కడే మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యాకమిటీ ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

బాలాయపల్లి (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అబివృద్ధిలో విద్యా కమిటీలే కీలకమని ఎంఈఓ-2 ప్రదీప్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని పాఠశాలల విద్యా కమిటీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. టీవీ రమణయ్య, కృష్ణమూర్తి, రవికుమార్ తదితరులు పాల్గన్నారు.

వేణుంబాక చిరస్మరణీయుడు



సాయికోటారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి: మండల పరిధిలోని చెందోడులో శుక్రవారం మాజీ సర్పంచ్, ఎంపీటీసీ వేణుంబాక సాయికోటారెడ్డి 9వ వర్ధంతిని టీడీపీ నాయకులు జరుపుకున్నారు. సాయికోటారెడ్డి చిత్రపటం వద్ద కుటుంబసభ్యులతోపాటు టీడీపీ నాయకులు బందిల రఘురామ్, పుచ్చలపల్లి సుధాకర్‌రెడ్డి, కృష్ణ, బాలసుబ్రహ్మణ్యం నివాళులర్పించి, పేదలకు అన్నదానం చేశారు.

మానసిక వికలాంగులకు కిట్ల పంపిణీ

డక్కిలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో అంధత్వం కలిగిన విద్యార్థులు, మానసిక వికలాంగులకు బ్రెయిలీ కిట్లు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు వినికిడి యంత్రాలను శుక్రవారం పంపిణీ చేసినట్లు భవిత ఉపాధ్యాయురాలు బి.కిష్మసౌమ్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ మానసిక వికలాంగులకు డక్కిలి భవిత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పగించాలి

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతలను ఆర్టీసీకే అప్పగించాలని స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 7వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. శేషయ్య, కేఎస్ వాసులు, రమేష్, రవీంద్ర, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

గూడూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రవి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రయ్య, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకొన్న ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శుక్రవారం టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని నమోదు చేసుకొన్నారు. రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకొన్నారు. ఆమెతోపాటు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, రాయపాటి రాజేంద్ర ప్రసాద్ కూడా శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

రెడ్డిపాళెం పాఠశాలలో పారిశుధ్య పనులు

వాకాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాళెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం టీడీపీ నాయకులు మల్లాపు వెంకటాద్రి, మల్లాపు ప్రదీప్ సౌజన్యంతో పారిశుధ్య పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించి బ్లీచింగ్‌పౌడర్ చల్లించారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలి

● ఎమ్మెల్యే విజయశ్రీ



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల తదితరులు

నాయుడుపేట/సూళ్లూరుపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. శుక్రవారం శ్రీకాళహస్తిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి మాట్లాడారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో వట్రపాలెం చిన్నపాటి వర్షమొచ్చినా ముంపునకు గురవుతుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నాయుడుపేట మండలంలోని కమ్మవారిపాళెంకు రూ.5 కోట్లతో రోడ్డు, చిగురుపాడుకు రూ.2 కోట్లతో సిమెంట్ రోడ్లు అవసరమవుతాయన్నారు. అలాగే ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలను ఖరారు చేయాలని వారు కోరారు. వీరి వెంట పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య ఉన్నారు.

మహిళా విద్య ప్రోత్సాహానికి సావిత్రిబాయిపూలే కృషి





సావిత్రిబాయి జ్యోతిరావ్ పూలే దంపతుల విగ్రహాలకు గూడూరులో సీపీఎం నాయకులు, నాయుడుపేటలో జువ్వలపాటి తదితరుల నివాళులు

గూడూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలను విద్యలో ప్రోత్సహించేందుకు సావిత్రిబాయిపూలే ఎనలేని కృషిచేశారని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్‌బీ కార్యాలయ సమీపంలోని జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలకు సీపీఎం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా నివాళులర్పించారు. శివకుమార్, శ్రీనివాసులు, సురేష్, బీవీ రమణయ్య, మణి, ప్రసాద్, భాస్కర్‌గౌడ్, చంద్రయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, మూమెంట్ 21 ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా అధ్యాపకులను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకర్‌శర్మ, సీడీపీవో శారదాంబ, వైస్‌ప్రిన్సిపాల్ విక్టోరియారాణి, మూమెంట్21 జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తడ (ఆంధ్రజ్యోతి): పాములమిట్ట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఉస్మాన్‌బాషా, కాశింగాడుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం రఘురామయ్య, కొత్తకుప్పం గ్రామంలో హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యావ్యవస్థకు ఆమె చేసిన కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాయుడుపేట (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే నిరక్షరాస్యురాలైనప్పటికీ భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో విద్యాభ్యాసం చేశారని బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్ అన్నారు. శుక్రవారం నాయుడుపేట బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే - సావిత్రిబాయి పూలే విగ్రహాలకు బీసీ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ సంఘ నాయకులు ఎం.బాలాజీ, ఈ.ప్రతాప్, వి.శివకుమార్, షరీఫ్, సులేమాన్, ఎ.వినోద్, మునిశేఖర్, హైదర్‌అలీ, ప్రసాద్, హరీష్, ముని తదితరులు ఉన్నారు.

కోట (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులంలో బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించి స్వీట్‌లు పంపిణీ చేశారు.అదే విధంగా విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ, వెంకన్నపాళెంలో రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా బాలాజీ



ఓరుగంటి బాలాజీకి సర్టిఫికేట్ అందజేస్తున్న ఎస్వీయూ వైస్ చాన్సలర్ అప్పారావు

నాయుడుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఓరుగంటి బాలాజీని సత్కరించి సర్టిఫికేట్‌ను ఎస్వీ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ అప్పారావు, మాజీ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు, చిత్తూరుజిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ ఆఫీసర్ లక్ష్మీలు శుక్రవారం ఎస్వీ యూనివర్శిటీలో అందజేశారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాలాజీని సత్కరించడంతో ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న యశోద, సరస్వతి, భువనేశ్వరులు

నాయుడుపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నాయుడుపేట మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో, అన్ని ఉపాధ్యాయ సంఘాలు శుక్రవారం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఉత్తమ మండలస్థాయి ఉపాధ్యాయులుగా ఎ.యశోద (గొట్టిప్రోలు), కె.సరస్వతి (బిరదవాడ), ఎ.భువనేశ్వరి (తుమ్మూరు)లను ఎంపిక చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, ఎంఈవో మునిరత్నం, యూనియన్ నాయకులు పేర్నాటి రామకృష్ణ, గొడ్డు బాబు, చంద్రయ్య, సుబ్బారావు, అల్లెయ్య, సురేష్, తదితరులు ఉన్నారు.


జాతీయ జూడో పోటీలకు చిట్టేడు విద్యార్థి ఎంపిక



సంతోష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న సంతోష్ జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ శేషవర్ధన్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు, మెమొంటోలతో అభినందించారు. గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్శిటీలో డిసెంబరు 27, 28, 29 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ జూడో పోటీల్లో నెల్లూరుజిల్లా తరఫున సంతోష్ పాల్గొని 80 కేజీల విభాగంలో ప్రథమస్థానం సాధించాడు. ప్రిన్సిపాల్ శేషవర్ధన్, చంద్రశేఖర్, సత్యనారాయణ తదితరులు అభినందించారు.

ఏపీటీఎఫ్ ఉద్యమసేవ రత్న అవార్డులు ప్రదానం



అవార్డులు అందుకున్న మోహన్, సారంగపాణి, చంద్రశేఖర్

నాయుడుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ సంఘానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు బందిల మోహన్, సారంగపాణి, జడ్పీ బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.చంద్రశేఖర్‌బాబులకు ఆ సంఘం నాయకులు నాయుడుపేట కార్యాలయంలో శుక్రవారం ఏపీటీఎఫ్ సంఘ ఉద్యమసేవ రత్న అవార్డులను అందజేశారు. తమ సేవలను గుర్తించి సత్కరించిన ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు సీహెచ్ అల్లెయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఆనంద్, అన్నమేడు హెచ్‌ఎం ఎస్ మధుసూదన్, ఎకోల్లు హెచ్‌ఎం సీహెచ్ నరసింహారావు తదితర ఉపాధ్యాయులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

వాకాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడివాక సమీపంలో కోడిపందేల స్థావరంపై శుక్రవారం దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఈసందర్భంగా రెండు కోడి పుంజులు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదాలు జరగకుండా నివారించాలి

పెళ్లకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరగడం బాధాకరమని, ఇకపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎల్.లక్ష్మీరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, జిల్లా కార్యదర్శి మునిరాజా డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రమాదంలో మృతిచెందిన సిపాయిలాల్ కుటుంబానికి రూ.కోటి, గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించడంతోపాటు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాద సంఘటనపై విచారణచేసి సంబంధిత అధికారులతోపాటు యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ముకుంద, రాధాకృష్ణ, నాగేంద్ర, సుధాకర్‌రెడ్డి, ఏఐఎఫ్‌టీయూ కార్యవర్గ సభ్యులు వీవీ రమణయ్య, చాపల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సైన్సు ఫెయిర్‌లో సూళ్లూరుపేట విద్యార్థులు

సూళ్లూరుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్బీఎస్ బాలుర హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి సైన్సు ఫెయిర్‌లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో రెండో బహుమతి లభించింది. ఈ పాఠశాలలో పదో తరగతికి చెందిన పి.గణేష్, బి.జశ్వంత్‌కుమార్‌రావులు జేసీబీ వర్కింగ్ మోడల్ ప్రదర్శనకు జిల్లా స్థాయి రెండో బహుమతికి ఎంపికయ్యారు. వీరికి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఈవో కేవీఎన్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు గజేంద్రను హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి అభినందించారు.

108 సిబ్బందికి సత్వరమే వేతనాలు పెంచాలి



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న కిరణ్‌కుమార్

నాయుడుపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేర సత్వరమే వేతనాలు రూ.4వేలు పెంపుదల చేయాలని ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను నాయుడుపేటకు చెందిన 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్ కోరినట్లు తెలిపారు. శుక్రవారం అమరావతిలో మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అర్చక పురోహితులకు పంచాంగాల వితరణ

కోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోటలోని కామాక్షిదేవి సమేత సోమేశ్వర ఆలయంలో శుక్రవారం సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో 73 మంది అర్చకులు, పురోహితులకు విశ్వావసు నామ సంవత్సరానికి సంబంధించి విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరావు, అనురాధ దంపతుల దాతృత్వంతో పంచాంగాలు అందజేశారు. సీతారామధార్మిక సేవాసంస్థ ప్రతినిధి అనంతబాబు, నాగరాజు, హేమంత్ కుమార్, శేషాద్రి, నరేష్, సాయిబాబా పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు

వెంకటగిరిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. సీఐ ఏవీ రమణ, ఎస్ఐలు సుబ్బారావు, భవానీ, గోపీ, శంకర్, ఏఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన, ఉపాధి అవకాశాలు

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో కోడ్నెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మూడు రోజులపాటు జరిగిన క్యాంపస్ డ్రైవ్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 27మంది విద్యార్థులు కోడ్నెస్ట్ సంస్థకు ఎంపికయ్యారని చెప్పారు. సంస్థ సీఈవో ప్రభాకరం, కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య, రామయ్య, అర్చన తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ఫ్యాక్టరీలో కార్మికుల డిష్యుం.. డిష్యుం

పెళ్లకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలోని వేర్వేరు రాష్ట్రాలకు చెందిన కార్మికులు శుక్రవారం బాహాబాహీకి దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండురోజుల క్రితం స్టీల్ ఫ్యాక్టరీలో జరిగిన భారీ అగ్నిప్రమాద సంఘటనతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో కొంతమంది మేము ఇక్కడ పనిచేయలేమని, ఇప్పటివరకు పనిచేసిన దినాలకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో యాజమాన్యానికి అనుకూలంగా మరి కొంతమంది కార్మికులు ఇక్కడే పనిచేసుకుందామని సూచించారు. ఈ విషయమై కార్మికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. ఈ వివాదంపై సమాచారం అందుకున్న నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని ఇరువర్గాల కార్మికులతో మాట్లాడారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.